
@vaartanews @mvnewstv www.mivaartanews.com
TGBIL/25/A0512
మీ వార్త
AP EDITION
ప్రతి అక్షరం... ప్రజల కోసం
విజయవాడ
సోమవారం 2 నవంబర్ 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-

వార్త
విలేకరులు కావలెను
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
96763 94932

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సిక్కుల గాయాలపై కాంగ్రెస్ మళ్లీ ఉప్పు చల్లింది!

- 1984 అల్లర్ల వార్షికోత్సవం రోజే ఢిల్లీలో ర్యాలీ ఎందుకు?
- కాంగ్రెస్, రాహుల్ గాంధీపై అమిత్ షా తీవ్ర విమర్శలు
- వేలాది మంది సిక్కులను సజీవ దహనం చేశారు
- బాధితులకు మోదీ ప్రభుత్వం న్యాయం చేసిందని వెల్లడి
- సోనియా గాంధీ ప్రధాని కల నెరవేరదంటూ వ్యాఖ్యలు

ఫలితాలపై ఉత్కంఠ!

- మున్సిపల్ ఎన్నికల ఓటింగ్ పూర్తి..
- ఏపీలో ముగిసిన మున్సిపల్ పోరు!
- 3న ఓట్ల లెక్కింపు.. అదే రోజు ఫలితాలు
- 92 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్
- సాయంత్రం 5 గంటలకు క్యూలైన్‌లో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం
- విజయవాడ 55వ డివిజన్‌లో రెండున్నర గంటల అదనపు సమయం
- స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ఠ భద్రతకు ఏర్పాట్లు
- పోలింగ్ సరళిపై 12 జిల్లాల కలెక్టర్లతో ఎస్ఈసీ సమీక్ష



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 92 పట్టణ స్థానిక సంస్థల్లో ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. నిర్ణీత సమయానికి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్‌లో ఉన్న ఓటర్లందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు, ఫిర్యాదులు మినహా పోలింగ్ ప్రక్రియ సాధారణంగా సాగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నెల 3న ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలు ప్రకటించనున్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 55వ డివిజన్‌లో బ్యాలెట్ పేపర్‌పై గుర్తుల ముద్రణలో తలెత్తిన సమస్య కారణంగా పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. - మిగతా3లో

ఓటు వేయకుండానే వెనుదిరిగిన జగన్!



- పులివెందులలో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్
- 70 పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ ఏజెంట్లను అడ్డుకున్నారని ఆరోపణ
- ఆర్వో కార్యాలయం ఎదుట ఏజెంట్లతో కలిసి బైఠాయింపు
- ఎన్నికల ప్రక్రియను రద్దు చేసి మళ్లీ పోలింగ్ జరపాలని వినతి
- రీపోలింగ్ జరిగితేనే ఓటు వేస్తానని స్పష్టీకరణ

పులివెందుల

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలింగ్ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను అనుమతించలేదని, ఓటర్లను అడ్డుకున్నారని ఆరోపిస్తూ ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని ఆరోపిస్తూ తాను ఓటు వేయకుండానే వెనుదిరిగారు. పులివెందుల మున్సిపాలిటీలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. రీపోలింగ్ - మిగతా3లో



ప్రతి క్షణం యుద్ధానికి సిద్ధంగా ఉండాలి!

- వాయుసేనను మరింత బలోపేతం చేయడమే లక్ష్యం
- కొత్త చీఫ్ ఎయిర్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్ స్పష్టీకరణ
- స్వదేశీ యుద్ధ విమానాలు, ఆయుధ వ్యవస్థలకు పెద్దపీట
- డ్రోన్లు, ఏఐ, సైబర్ దాడులను ఎదుర్కొనేలా సన్నద్ధత
- త్రివిధ దళాల మధ్య సమన్వయానికి ప్రత్యేక ప్రాధాన్యం

పట్టాలెక్కేందుకు భారత్ తొలి బుల్లెట్ రైలు సిద్ధం!

- వచ్చే ఏడాది మే-జూన్‌లో ట్రయల్ రన్..
- ఢిల్లీ-వారణాసి మధ్య 3.5 గంటల్లో ప్రయాణం
- స్వదేశీ బుల్లెట్ రైలు తయారీ దృశ్యాలు విడుదల
- పరీక్షల అనంతరం ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం
- వడోదర-ముంబై ప్రయాణం గంటన్నరలోనే!





జ్ఞానేశ్ కుమార్‌కు జైలు తప్పదు!

- మోదీ, షాలకు పదవులు రావడానికి ఆయనే కారణం
- సీఈసీపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు.. ఎన్నికల వ్యవస్థను ధ్వంసం చేశారు
- ఓట్ల చోరీతోనే బీజేపీ విజయాలు సాధించిందని వ్యాఖ్య
- అదానీ ప్రయోజనాల కోసమే కేంద్రం పనిచేస్తోందని ఆరోపణ
- రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇండియా కూటమి పిలుపు

అర్నబ్ తుపాను నష్టం రూ.4,764 కోట్లు!




- కేంద్ర బృందానికి ప్రాథమిక నివేదిక అందించిన రాష్ట్ర ప్రభుత్వం
- 3.75 లక్షల హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం
- 9 మంది మృతి.. 81 వేల మందికి పునరావాసం
- విద్యుత్ రంగానికి రూ.1,233 కోట్ల నష్టం
- రహదారుల పునరుద్ధరణకు రూ.1,623 కోట్లు అవసరం
- బాధితుల సహాయార్థం ఎస్‌బీఐ రూ.5.01 కోట్ల విరాళం

అమరావతి

అర్నబ్ అతితీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. అక్టోబరు 26 నుంచి మూడు రోజుల పాటు 16 జిల్లాలపై ప్రభావం చూపిన తుపాను కారణంగా వివిధ రంగాలకు మొత్తం రూ.4,764 కోట్ల నష్టం వాటిల్లినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. ఈ మేరకు రూపొందించిన నివేదికను శనివారం కేంద్ర బృందానికి అందజేసింది. తుపాను కారణంగా వేర్వేరు ఘటనల్లో తొమ్మిది మంది మృతి చెందగా, లక్షలాది మంది ప్రజలు ప్రభావితమయ్యారు. వ్యవసాయం, ఉద్యానవనాలు, మత్స్య, విద్యుత్, రహదారులు, గృహ నిర్మాణం తదితర రంగాలకు - మిగతా3లో

రెచ్చగొట్టినా సంయమనం కోల్పోవద్దు!

- కూటమి శ్రేణులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- పోలింగ్ శాతం పెంచేందుకు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలి
- వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేలా సహకరించాలి
- ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- అవాంఛనీయ ఘటనలపై వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలి



అమరావతి

స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ వేళ కూటమి శ్రేణులు సంయమనం పాటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ప్రత్యర్థులు రెచ్చగొట్టేలా, కుట్రపూరితంగా వ్యవహరించే అవకాశం ఉందని, ఎట్టి పరిస్థితుల్లోనూ సహనం కోల్పోవద్దని స్పష్టం చేశారు. పోలింగ్ సరళి, క్షేత్రస్థాయిలో పరిస్థితులపై కూటమి పార్టీల ముఖ్యనేతలు, కార్యకర్తలతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. పోలింగ్ శాతం పెంచేందుకు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోందని చంద్రబాబు తెలిపారు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలతో పోలిస్తే ఈసారి ప్రజల్లో మంచి స్ఫూర్తి కనిపిస్తోందన్నారు. కొన్ని మున్సిపాలిటీల్లో ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు వస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉందని - మిగతా3లో



ఓటమిని జీర్ణించుకోలేక కుట్రలు!

- ఎన్నికల్లో ఓటమితో రాజ్యాంగ సంస్థలపై విమర్శలు
- రాహుల్ గాంధీపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తీవ్ర ఆరోపణలు
- కాంగ్రెస్‌లో వంశపారంపర్య పాలన కొనసాగుతోందని విమర్శ
- 1984 సిక్కుల ఊచకోతపై కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- 'లోక్‌తంత్ర్ బచావో.. అరాచక్ హటావో' పేరుతో బీజేపీ పాదయాత్రలు

ఓట్ల చోరీతోనే బీజేపీ విజయాలు..

ఎన్నికల సంఘంపై ఇండియా కూటమి ధ్వజం!
సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్
మోదీని సాగనంపి రాజ్యాంగాన్ని కాపాడాలని ఖర్గే పిలుపు



సిక్కుల గాయాలపై కాంగ్రెస్ మళ్లీ ఉప్పు చల్లింది!

చండీగఢ్: కాంగ్రెస్ పార్టీపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితుల గాయాలపై కాంగ్రెస్ మరోసారి ఉప్పు చల్లుతోందని ఆరోపించారు. సిక్కుల ఊచకోత జరిగిన నవంబర్ 1వ తేదీనే ఢిల్లీలో రాజకీయ ర్యాలీ నిర్వహించడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. అల్లర్లలో వేలాది మంది సిక్కులు ప్రాణాలు కోల్పోయారని, అనేక కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయని గుర్తుచేశారు. చండీగఢ్‌లో జరిగిన సభలో ప్రసంగించిన ఆయన.. కాంగ్రెస్ పార్టీతో పాటు రాహుల్ గాంధీపై విమర్శలు చేశారు.



రాజీవ్ వ్యాఖ్యలను మర్చిపోలేం

1984 నవంబర్ 1న కాంగ్రెస్ పార్టీ రెచ్చగొట్టడం వల్లే ఢిల్లీలో సిక్కులపై దాడులు జరిగాయని అమిత్ షా ఆరోపించారు. వేలాది మంది సిక్కులు సజీవ దహనమయ్యారని, ఎంతోమంది తమ ఆస్తులను కోల్పోయి నిరాశ్రయులయ్యారని పేర్కొన్నారు. అనేక మంది పిల్లలు అనాథలుగా, మహిళలు వితంతువులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ చేసిన 'ఒక పెద్ద చెట్టు కూలినప్పుడు భూమి కంపించడం సహజమే' అనే వ్యాఖ్యలను ప్రస్తావించారు. వేలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనను అంత తేలికగా ఎలా సమర్థించగలరని ప్రశ్నించారు.

బాధితులకు న్యాయం చేశాం

1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితులకు న్యాయం చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుందని అమిత్ షా తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అల్లర్లకు సంబంధించిన కేసులను తిరిగి తెరిచి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించినట్లు వెల్లడించారు. అల్లర్లకు బాధ్యులైన వారిని చట్టం ముందు నిలబెట్టేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో జరిగిన ఈ ఘటన దేశ చరిత్రలో మాయని మచ్చగా మిగిలిపోయిందని వ్యాఖ్యానించారు.

ర్యాలీ తేదీ మార్చమని కోరినా వినలేదు

సిక్కుల ఊచకోత జరిగిన రోజునే ఢిల్లీలో ర్యాలీ నిర్వహించడంపై అమిత్ షా అభ్యంతరం వ్యక్తం చేశారు. ర్యాలీ తేదీని మార్చుకోవాలని బీజేపీ కోరినా కాంగ్రెస్ పట్టించుకోలేదని ఆరోపించారు. దీపావళి పండుగ తర్వాత ర్యాలీ నిర్వహించాలని ఢిల్లీ వ్యాపారులు కూడా విజ్ఞప్తి చేశారని చెప్పారు. పండుగ సీజన్‌లో వ్యాపారానికి అంతరాయం కలుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ కాంగ్రెస్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదని విమర్శించారు. సిక్కు గురువుల పుణ్యభూమి నుంచి ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

సోనియా కల నెరవేరదు

ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ విపక్షాలు నిర్వహిస్తున్న నిరసనలపైనా అమిత్ షా స్పందించారు. అబద్ధాలు ప్రచారం చేయడం, గందరగోళం సృష్టించడం, పార్లమెంట్ కార్యకలాపాలను అడ్డుకోవడం విపక్షాలకు అలవాటుగా మారిందని విమర్శించారు. ఇదే వైఖరి కొనసాగిస్తే మరో ఐదేళ్లపాటు ప్రతిపక్షంలోనే ఉండాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలన్న సోనియా గాంధీ కల ఎప్పటికీ నెరవేరదని అన్నారు.

దేశాన్ని డ్రగ్స్ రహితంగా మారుస్తాం

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని అమిత్ షా పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు, త్రిపుల్ తలాక్ నిషేధం, నక్సలిజం నిర్మూలన దిశగా చేపట్టిన చర్యలను ప్రస్తావించారు. 2029 డిసెంబర్ 31 నాటికి పంజాబ్‌తో సహా దేశవ్యాప్తంగా డ్రగ్స్ సమస్యను నిర్మూలించడమే లక్ష్యమని ప్రకటించారు. దేశ భద్రత, అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

జ్ఞానేశ్ కుమార్‌కు జైలు తప్పదు!

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల వ్యవస్థను దెబ్బతీశారంటూ ఆయనపై ఆరోపణలు చేస్తూ.. భవిష్యత్తులో పదవి నుంచి తొలగించి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. జ్ఞానేశ్ కుమార్ లేకుంటే నరేంద్ర మోదీ ప్రధాని, అమిత్ షా కేంద్ర హోంమంత్రి అయ్యేవారు కాదని వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం ఇండియా కూటమి నిర్వహించిన భారీ ర్యాలీలో రాహుల్ ప్రసంగించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశ ప్రజలు ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. ఎంతటి ధనబలం, పలుకుబడి ఉన్నా రాజ్యాంగం కంటే ఎవరూ గొప్పవారు కారని స్పష్టం చేశారు.



జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తప్పవు

దేశ ఎన్నికల వ్యవస్థను నాశనం చేసేందుకు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కలిసి కుట్ర చేశారని రాహుల్ ఆరోపించారు. ముగ్గురూ కలిసి దేశ ఆత్మ, రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నారని విమర్శించారు. జ్ఞానేశ్ కుమార్‌ను సీఈసీ పదవి నుంచి తొలగించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయన చేసిన తప్పులకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జ్ఞానేశ్ కుమార్ కారణంగానే మోదీ, షాలు కీలక పదవుల్లో కొనసాగుతున్నారని ఆరోపించారు.

మోదీ పారిపోతానన్నా వదిలిపెట్టం

అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. మోదీ ఎక్కడికీ వెళ్లరన్న అమిత్ షా వ్యాఖ్యలపై స్పందిస్తూ.. మోదీ పారిపోవాలనుకున్నా తాము వదిలిపెట్టబోమని అన్నారు. దేశంలోని యువత, రైతులు, కార్మికులు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని కోరుకుంటున్నారని తెలిపారు. తన మతం గురించి ప్రశ్నిస్తే.. దేశ ప్రజల గొంతుకను వినిపించడమే తన మతమని సమాధానమిచ్చారు. ఈ నిరసన ఏ ఒక్క పార్టీకి, నాయకుడికి సంబంధించినది కాదని, దేశ ప్రజలందరి గొంతుక అని పేర్కొన్నారు.

12 ఏళ్లలో ఎవరికైనా మేలు జరిగిందా?

కేంద్ర ప్రభుత్వ పాలనలో సామాన్యులు, రైతులు, యువత, కార్మికుల పరిస్థితి ఏమాత్రం మెరుగుపడలేదని రాహుల్ విమర్శించారు. యువతకు ఉద్యోగాలు లేవని, రైతులకు తగిన ఆదాయం రావడం లేదని అన్నారు. దేశ సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందని ఆరోపించారు. టెలికాం, పోర్టులు, బ్యాంకులు సహా కీలక రంగాల్లో అదానీకి ప్రయోజనం చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇద్దరు, ముగ్గురు పారిశ్రామికవేత్తలు మాత్రమే అభివృద్ధి చెందే వ్యవస్థ దేశానికి అవసరం లేదని వ్యాఖ్యానించారు.

ఓట్ల చోరీతోనే బీజేపీ విజయాలు

దేశంలో కొన్నేళ్లుగా ఓట్ల చోరీ జరుగుతోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈవీఎంలు, ఓటర్ల జాబితాల్లో మార్పుల ద్వారా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేశారని విమర్శించారు. పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, హరియాణా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరుతో కోట్లాది ఓట్లు తొలగించారని పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు కూడా పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించారని అన్నారు. ఎన్డీఏ, యూపీఏ మధ్య ఓట్ల వ్యత్యాసం స్వల్పంగా ఉన్నప్పటికీ ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పాత్రపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరి గొంతుకను కాపాడాలి

దేశంలో విద్వేషానికి తావులేకుండా ప్రేమ, సోదరభావాన్ని పెంపొందించాలని రాహుల్ పిలుపునిచ్చారు. హిందూ, ముస్లిం, సిక్కు, ఆదివాసీ, దళితులతో పాటు మహిళలు, దివ్యాంగులు.. ఇలా ప్రతి ఒక్కరి హక్కులు, గొంతుకను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చివరి వరుసలో ఉన్న వ్యక్తి అభిప్రాయానికి కూడా ప్రజాస్వామ్యంలో సమాన ప్రాధాన్యం ఉండాలని పేర్కొన్నారు. దేశంలో మళ్లీ ప్రేమ, సోదరభావం వెల్లివిరిసేలా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఓటమిని జీర్ణించుకోలేక కుట్రలు!

రోహ్‌తక్: ఎన్నికల్లో ప్రజా తీర్పును అంగీకరించలేక కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య సంస్థలపై దాడికి దిగుతోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ విమర్శించారు. ఎన్నికల్లో ఓటమితో నిరాశ, నిస్పృహలకు గురైన కాంగ్రెస్ నేతలు రాజ్యాంగ సంస్థలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో వంశపారంపర్య రాజకీయాలు కొనసాగుతున్నాయని, రాజ్యాంగ పరిరక్షకులుగా చెప్పుకుంటూనే దాని విలువలను బలహీనపరుస్తున్నారని మండిపడ్డారు. విదేశీ శక్తుల ఆదేశాల మేరకు రాహుల్ గాంధీ వ్యవహరిస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. దిల్లీలో ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నిర్వహించిన ర్యాలీకి పోటీగా హరియాణాలో బీజేపీ చేపట్టిన 'లోక్‌తంత్ర బచావో.. అరాచక హటావో' కార్యక్రమంలో నితిన్ నబిన్ పాల్గొన్నారు. రోహ్‌తక్‌లోని ఛోటూరామ్ పాలిటెక్నిక్ మైదానం నుంచి మోడల్ టౌన్‌లోని డి-పార్క్ వరకు పాదయాత్ర నిర్వహించి, అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.



కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం ఎక్కడ?

కాంగ్రెస్ పార్టీ ప్రజల నుంచి తగిన మద్దతు పొందడంలో విఫలమైన ప్రతిసారీ రాజ్యాంగ సంస్థలను నిందిస్తోందని నితిన్ నబిన్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమమని, ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు వ్యవస్థలను తప్పుబట్టడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలకు నిజంగా ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉంటే ముందుగా తమ పార్టీలో కొనసాగుతున్న కుటుంబ పాలనను అంతం చేయాలని సూచించారు. రాహుల్ గాంధీ లేదా ఆయన కుటుంబం చెప్పిందే పార్టీ నిర్ణయంగా మారుతోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నామని చెప్పుకునే కాంగ్రెస్ నేతలే గతంలో దాని పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు.

చొరబాటుదారులపై కాంగ్రెస్‌కు ప్రేమ!

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) విషయంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరిని నితిన్ నబిన్ తప్పుబట్టారు. దేశంలోని కోట్లాది మంది ప్రజల కంటే చొరబాటుదారులపైనే కాంగ్రెస్‌కు ఎక్కువ నమ్మకం ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలిచినప్పుడు ప్రజాస్వామ్యం గెలిచిందని ప్రకటిస్తోందని, ఓడిపోయిన రాష్ట్రాల్లో మాత్రం ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందంటూ ప్రచారం చేస్తోందని విమర్శించారు. హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటకలో విజయాలను ప్రజా తీర్పుగా అభివర్ణించిన కాంగ్రెస్.. హరియాణా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఓటములను మాత్రం ప్రశ్నిస్తోందని అన్నారు.

1984 సిక్కుల ఊచకోతపై క్షమాపణ చెప్పాలి

1984లో జరిగిన సిక్కుల ఊచకోతపై కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు క్షమాపణ చెప్పలేదని నితిన్ నబిన్ విమర్శించారు. అప్పటి హింసాకాండలో ప్రాణాలు కోల్పోయిన సిక్కులకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పి ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిందని అన్నారు. అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ చేసిన 'పెద్ద చెట్టు కూలితే భూమి కంపిస్తుంది' అనే వ్యాఖ్యను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. గత ఘటనలకు సమాధానం చెప్పకుండా ఇప్పుడు ప్రజాస్వామ్యం పేరుతో నిరసనలు చేపట్టడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు.

ఓట్ల చోరీతోనే బీజేపీ విజయాలు..

న్యూఢిల్లీ: దేశంలో ఎన్నికల వ్యవస్థను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తనకు అనుకూలంగా ఉపయోగించుకుంటోందని కాంగ్రెస్ సహా ఇండియా కూటమి నేతలు ఆరోపించారు. సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖలను ఉపయోగించుకుని ప్రతిపక్షాలను ఇబ్బందులకు గురిచేసిన బీజేపీ.. ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని కూడా తన రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని విమర్శించారు. యువత, మహిళలు, దళితుల ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన 'చలో దిల్లీ' సభలో ప్రతిపక్ష పార్టీల అగ్రనేతలు కేంద్ర ప్రభుత్వంతోపాటు ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, వామపక్ష నేతలు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ గతంలో సీబీఐ, ఈడీ, ఐటీ శాఖలను ఉపయోగించుకుని ప్రతిపక్షాలను భయపెట్టిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఇప్పుడు ఆ సంస్థలతో సరిపెట్టకుండా ఎన్నికల సంఘాన్ని కూడా తన రాజకీయ అవసరాలకు ఉపయోగించుకుంటోందని విమర్శించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. ఆయనను కాపాడేందుకు పలువురిని జైలుకు పంపుతున్నారని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని బీజేపీ పలు రాష్ట్రాల్లో విజయాలు సాధించిందని విమర్శించారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలంటే మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 'మోదీ హఠావో.. దేశ్ బచావో' అంటూ నినదించారు. దేశంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికీ ఉందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ అన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వమంటూ బీజేపీ ప్రజలను మోసం చేస్తోందని, ఉత్తరప్రదేశ్‌లో అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. ఒక్క యూపీలోనే 1.17 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారని ఆరోపించారు. ప్రజల మద్దతుతో కాకుండా ఎన్నికల సంఘం సహకారంతోనే బీజేపీ గెలుస్తోందని వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్‌లో అనుసరించిన ఓట్ల తొలగింపు విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. యూపీ ఉపఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయని, ఓటర్లను భయపెట్టి ఓటు వేయకుండా చేశారని అన్నారు.

పట్టాలెక్కేందుకు భారత్ తొలి బుల్లెట్ రైలు సిద్ధం!



న్యూఢిల్లీ: భారత రైల్వే రంగంలో మరో కీలక ముందడుగు పడుతోంది. దేశీయంగా తయారవుతున్న తొలి బుల్లెట్ రైలు త్వరలో పట్టాలపై పరీక్షలకు సిద్ధం కానుంది. ఈ రైలు తయారీకి సంబంధించిన అరుదైన దృశ్యాలను కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదివారం సోషల్ మీడియాలో విడుదల చేశారు. వచ్చే ఏడాది మే లేదా జూన్ నాటికి రైలును ట్రయల్ రన్ కోసం పట్టాలపైకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. రెండు నుంచి నాలుగు నెలల పాటు పరీక్షలు నిర్వహించిన అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు.

స్వదేశీ పరిజ్ఞానంతో తయారీ..

ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంలో భాగంగా దేశీయంగా బుల్లెట్ రైలును రూపొందిస్తున్నట్లు మంత్రి వివరించారు. రైలు తొలి బాడీ ఫ్రేమ్ తయారీ పూర్తయిందని, దానిని పటిష్ఠతను పరీక్షించే స్ట్రీజ్ టెస్ట్ కోసం పంపినట్లు తెలిపారు. పిల్లర్లు, గర్డర్ల నుంచి రైలు తయారీ వరకు స్వదేశీ సాంకేతికతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా దేశీయ ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, కార్మికులకు అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.

వడోదర నుంచి ముంబైకి గంటన్నరలో..

ముంబై--అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్‌లో తొలి దశ సేవలు అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయాలు గణనీయంగా తగ్గనున్నాయి. వడోదర నుంచి ముంబైకి బుల్లెట్ రైలులో సుమారు గంటన్నరలో చేరుకోవచ్చని రైల్వే మంత్రి వెల్లడించారు. సూరత్--బిలిమోరా మధ్య తొలి విభాగాన్ని వచ్చే ఏడాది ప్రారంభించాలనే లక్ష్యంతో పనులు కొనసాగుతున్నాయి. ఈ కారిడార్ దేశంలో హైస్పీడ్ రైలు ప్రయాణానికి నాంది కానుంది.

ఉత్తర కారిడార్‌కు ఆమోదం..

మరోవైపు ఉత్తర భారతదేశంలోనూ బుల్లెట్ రైలు నెట్‌వర్క్ విస్తరణకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఢిల్లీ నుంచి ఆగ్రా, కాన్పూర్, లక్నో, అయోధ్య, వారణాసి, ప్రయాగ్‌రాజ్, పాట్నా, సిలిగురి మీదుగా గువాహటి వరకు అనుసంధానించే ఉత్తర కారిడార్‌కు ప్రధాని మోదీ ఆమోదం తెలిపినట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ కారిడార్ పూర్తయితే ఢిల్లీ--వారణాసి మధ్య ప్రయాణ సమయం సుమారు 3 గంటల 35 నిమిషాలకు తగ్గుతుందని అంచనా.

ప్రతి క్షణం యుద్ధానికి సిద్ధంగా ఉండాలి!



న్యూఢిల్లీ: దేశ భద్రతకు ఎలాంటి ముప్పు ఎదురైనా తక్షణమే స్పందించేలా భారత వాయుసేనను నిరంతరం అప్రమత్తంగా ఉంచాలని కొత్త వాయుసేన చీఫ్ ఎయిర్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్ స్పష్టం చేశారు. యుద్ధం ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు ప్రతి స్క్వాడ్రన్, రాడార్ వ్యవస్థ, మైమానిక రక్షణ విభాగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి వైమానిక సిబ్బంది క్షణాల్లో స్పందించే సామర్థ్యాన్ని కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. భారత వాయుసేన 29వ చీఫ్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన ఆయన ఆదివారం భవిష్యత్తు కార్యాచరణను వెల్లడించారు. వాయుసేనను మరింత శక్తిమంతంగా తీర్చిదిద్దేందుకు నాలుగు ప్రధాన అంశాలతో కూడిన 'వాయు' (ఎహ్ఖ) ప్రణాళికను ప్రకటించారు.

మారుతున్న యుద్ధ తంత్రాలకు అనుగుణంగా..

ప్రపంచవ్యాప్తంగా భద్రతా పరిస్థితులు వేగంగా మారుతున్నాయని ఆశుతోష్ దీక్షిత్ పేర్కొన్నారు. డ్రోన్లు, సుదూర లక్ష్యాలను ఛేదించే ఆయుధాలు, అంతరిక్ష వ్యవస్థలు, సైబర్ దాడులు, కృత్రిమ మేధ (ఏఐ), ఎలక్ట్రోమాగ్నెటిక్ వ్యవస్థలు యుద్ధ రంగాన్ని కొత్త దిశలోకి తీసుకెళ్తున్నాయని వివరించారు. ఈ పరిణామాలకు అనుగుణంగా వాయుసేన తన సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న యుద్ధ విమానాల సంఖ్యను ప్రభుత్వ నిర్దేశిత స్థాయికి పెంచడం తన ప్రాధాన్య లక్ష్యాల్లో ఒకటని వెల్లడించారు.

స్వదేశీ పరిజ్ఞానానికి పెద్దపీట

వాయుసేనలో ఆత్మనిర్భరతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని కొత్త చీఫ్ తెలిపారు. స్వదేశీ యుద్ధ విమానాలు, సెన్సార్లు, ఆయుధ వ్యవస్థల వినియోగాన్ని పెంచుతామని చెప్పారు. యుద్ధ సమయాల్లో విదేశీ సరఫరాలపై ఆధారపడకుండా దేశీయంగా తయారైన పరికరాలతోనే సమర్థంగా పోరాడే స్థాయికి వాయుసేనను తీసుకెళ్లడం లక్ష్యమన్నారు. బలమైన వైమానిక శక్తి ఉంటే శత్రు దేశాలు దాడులకు పాల్పడకుండా ముందుగానే నిరోధించవచ్చని అభిప్రాయపడ్డారు.

ఏఐ, డ్రోన్లపై ప్రత్యేక దృష్టి

వాయు ప్రణాళికలో భాగంగా యుక్తి, విన్యాస ఆలోచనలు, ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు దీక్షిత్ వెల్లడించారు. ఏఐ ఆధారిత కమాండ్ వ్యవస్థలు, నెట్‌వర్క్‌తో అనుసంధానమైన రక్షణ వ్యవస్థలు, డ్రోన్ల దాడులను అడ్డుకునే బహుళస్థాయి రక్షణ ఏర్పాట్లను అభివృద్ధి చేస్తామని చెప్పారు. విమానాల నిర్వహణను వేగవంతం చేయడం, సిబ్బంది భద్రత, అత్యవసర పరిస్థితుల్లోనూ కార్యకలాపాలు కొనసాగించే సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి సారిస్తామన్నారు. అంతరిక్షానికి సమీపంలోని ప్రాంతాలను భవిష్యత్తులో వైమానిక కార్యకలాపాలకు ఉపయోగించుకునే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు.

త్రివిధ దళాల సమన్వయమే కీలకం

భారత సైన్యం, నౌకాదళం, వాయుసేనతోపాటు ఇతర జాతీయ భద్రతా సంస్థలు సమష్టిగా పనిచేయాలని ఆశుతోష్ దీక్షిత్ స్పష్టం చేశారు. యుద్ధ ప్రణాళిక తొలి దశ నుంచే మూడు దళాల మధ్య సమన్వయం ఉండాలని చెప్పారు. అప్పుడే దేశ సైనిక సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోగలమని వివరించారు. జాయింట్‌నెస్, ఆత్మనిర్భరత, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇచ్చే 'జేఏఐ' లక్ష్యంతో ముందుకు సాగుతామని వెల్లడించారు.

3,300 గంటలకు పైగా విమాన ప్రయాణ అనుభవం

1986 డిసెంబర్ 6న ఫైటర్ పైలట్‌గా వాయుసేనలో చేరిన ఆశుతోష్ దీక్షిత్‌కు దాదాపు నాలుగు దశాబ్దాల అనుభవం ఉంది. మిరాజ్-2000, మిగ్ రకాలు, జాగ్వార్ వంటి యుద్ధ విమానాలను నడిపిన ఆయనకు 3,300 గంటలకు పైగా విమాన ప్రయాణ అనుభవం ఉంది. జాగ్వార్, మిగ్-27 విమానాల ఆధునికీకరణ ప్రాజెక్టులతోపాటు స్వదేశీ తేజస్ యుద్ధ విమానానికి సంబంధించిన కీలక ప్రక్రియల్లోనూ భాగస్వాములయ్యారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా పనిచేశారు. వాయుసేన చీఫ్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు వైస్ చీఫ్‌గా వ్యవహరించారు.

తల్లికి సెల్యూట్.. అమరవీరులకు నివాళి

వాయుసేన చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆశుతోష్ దీక్షిత్ నేషనల్ వార్ మెమోరియల్‌ను సందర్శించి అమరవీరులకు నివాళులర్పించారు. తన తల్లి నిర్మలా దీక్షిత్, అత్త కమలా పాండేలకు సెల్యూట్ చేసి గౌరవం చాటుకున్నారు. దేశ ప్రజలు వాయుసేనపై పూర్తి నమ్మకం ఉంచాలని కోరారు. దేశం ఎప్పుడు పిలిచినా స్పందించేందుకు సిద్ధంగా ఉంటామని, మారుతున్న భద్రతా పరిస్థితులకు అనుగుణంగా వాయుసేనను నిరంతరం ఆధునికీకరిస్తామని స్పష్టం చేశారు.

ఓటు వేయకుండానే వెనుదిరిగిన జగన్!

-మొదటిపేజీ తరువాయి

జరిగినప్పుడే వచ్చి ఓటు వేస్తానని స్పష్టం చేశారు.

70 కేంద్రాల్లో ఏజెంట్లకు అనుమతి లేదంటూ..

పులివెందుల మున్సిపాలిటీలో మొత్తం 80 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వైఎస్సార్‌సీపీకి చెందిన ఏజెంట్లను కేవలం పది కేంద్రాల్లోనే అనుమతించారని జగన్ ఆరోపించారు. మిగిలిన 70 కేంద్రాల్లో టీడీపీ కార్యకర్తలు తమ ఏజెంట్లను అడ్డుకుని, వారి అనుమతి పత్రాలను చించివేశారని పేర్కొన్నారు. తెల్లవారుజామునే కొన్ని పోలింగ్ కేంద్రాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారని, ఓటర్లను భయపెట్టి వెనక్కి పంపించారని ఆరోపించారు. ఓటరు స్లిప్పులు లాక్కోవడం, ఓట్లు వేయకుండా అడ్డుకోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని అన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించిన వీడియోలు, సీసీటీవీ ఫుటేజీలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు.

ఆర్వో కార్యాలయం ఎదుట బైఠాయింపు

పోలింగ్ కేంద్రాల్లో చోటుచేసుకున్న పరిణామాలపై ఫిర్యాదు చేసేందుకు జగన్ పులివెందుల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లారు. అయితే అధికారులు ఆయనను కార్యాలయంలోకి అనుమతించలేదని వైఎస్సార్‌సీపీ వర్గాలు తెలిపాయి. దీంతో కార్యాలయం వెలుపలే ఏజెంట్లు, పార్టీ నాయకులతో కలిసి ఆయన బైఠాయించి నిరసన తెలిపారు. బాధిత ఏజెంట్ల వాదనలు వినాలని, వారి నుంచి వ్యక్తిగతంగా వివరాలు సేకరించాలని రిటర్నింగ్ అధికారిని కోరారు. ఎన్నికల ప్రక్రియలో జరిగినట్లు చెబుతున్న అక్రమాలపై విచారణ జరిపి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

'నేను ఓటు వేయను.. రీపోలింగ్ జరిగినప్పుడే వస్తా'

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన జగన్.. ప్రస్తుత పరిస్థితుల్లో ఓటు వేయడం సమంజసం కాదని అన్నారు. "నేను ఓటు వేయను. ఇప్పుడు ఓటు వేస్తే ఎన్నికల ప్రక్రియ అంతా సక్రమంగా జరిగిందనే సంకేతం వెళ్తుంది. ఇక్కడ జరుగుతున్న పరిస్థితులు ప్రజలకు తెలియాలి. రీపోలింగ్ నిర్వహిస్తే తప్పకుండా వచ్చి ఓటు వేస్తా" అని స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం, అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభావంలో పనిచేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ వ్యవహారంపై న్యాయపోరాటం చేస్తామని, అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించారు.



రీపోలింగ్‌కు వినతిపత్రం

పులివెందుల మున్సిపాలిటీలోని మొత్తం 80 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియను రద్దు చేసి, తిరిగి ఎన్నికలు నిర్వహించాలని జగన్ రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఏజెంట్లను అడ్డుకున్న ఘటనలపై విచారణ జరపాలని, సీసీటీవీ ఫుటేజీలు, పోలింగ్ రికార్డులు భద్రపర చాలని కోరారు. బాధిత ఏజెంట్ల వాంగ్మూలాలు నమోదు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల సంఘం ఏమందంటే?

జగన్ రీపోలింగ్ డిమాండ్‌పై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పందించింది. పులివెందులలో జరిగిన ఘటనలపై జిల్లా కలెక్టర్, ఎస్పీ, సంబంధిత ఎన్నికల అధికారుల నుంచి నివేదికలు కోరినట్లు తెలిపింది. క్షేత్రస్థాయి నివేదికలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించిన తర్వాతే రీపోలింగ్‌పై నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. కేవలం ఆరోపణల ఆధారంగా నిర్ణయం తీసుకోలేమని, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

టీడీపీ వర్గాల నుంచి కూడా ఆరోపణలు

పులివెందులలో ఎన్నికల సందర్భంగా వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. మరోవైపు వైసీపీ శ్రేణులు ఓటర్లను భయపెట్టాయని, పోలింగ్‌కు ఆటంకం కలిగించాయని టీడీపీ వర్గాలు ఆరోపించాయి. ఈ పరస్పర ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల సంఘం విచారణ నివేదికలపై ఆసక్తి నెలకొంది. రీపోలింగ్ నిర్వహణపై అధికారిక నిర్ణయం వెలువడాల్సి ఉంది.

హెలికాప్టర్ ల్యాండ్ కాకూడదని 'కూటమి' కుట్ర

పులివెందులలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హెలికాప్టర్ ల్యాండింగ్‌కు చంద్రబాబు సర్కార్ ఆటంకాలు సృష్టించిన సంగతి తెలిసిందే. కూటమి సర్కార్ కుట్రలపై స్పందించిన వైఎస్ జగన్.. పులివెందులలో హెలికాప్టర్ ల్యాండ్ కాకూడదని కుట్ర పన్నారని.. తప్పనిసరి పరిస్థితుల్లో హెలికాప్టర్ ల్యాండ్ అయ్యిందన్నారు. ప్రజలను రక్షించాల్సినవారే భక్షిస్తే ఎలా?" అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. "కళ్లెదుటే గూండాలు కనిపిస్తున్నా పోలీసుల చర్యల్లేవు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఎస్ఈసీ పాటించడం లేదు. బూత్‌ల్లో వీడియో రికార్డింగ్, సీసీ కెమెరాలు లేవు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు లేకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు. ఏజెంట్లు లేకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నిస్తాం. రీ పోలింగ్ జరపాలని ఆర్వోను కోరతాం. ..యథేచ్ఛగా దొంగ ఓట్లు వేస్తున్నారు. ఎస్పీలు, కలెక్టర్లకు ఫోన్ చేసినా స్పందన లేదు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు లేకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు?. వచ్చిన ఓటర్లను పోలీసులే వెనక్కి పంపుతున్నారు. ఇది ప్రజాస్వామ్యమేనా?. పులివెందులలో జరుగుతున్న ఘటనలే ఇందుకు నిదర్శనం" అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అర్నబ్ తుపాను నష్టం రూ.4,764 కోట్లు!

-మొదటిపేజీ తరువాయి

జరిగిన నష్టాన్ని నివేదికలో వివరించింది.

ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే ప్రతికూల పరిస్థితుల్లో సాగు చేస్తున్న రైతులకు అర్నబ్ తుపాను తీవ్ర నష్టాన్ని కలిగించింది. రాష్ట్రవ్యాప్తంగా 2,253 గ్రామాల్లో 3.33 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. సుమారు 2.70 లక్షల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. మొత్తం 4.63 లక్షల మంది రైతులకు పెట్టుబడి రాయితీ కింద రూ.520 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని నివేదికలో పేర్కొన్నారు.

ఉద్యాన పంటలకూ నష్టం

216 మండలాల పరిధిలోని 1,318 గ్రామాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 80,822 మంది రైతులకు చెందిన 23,383 హెక్టార్లలో కొబ్బరి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటల రైతులకు రూ.739 కోట్ల పెట్టుబడి రాయితీ అవసరమని అంచనా వేశారు. 15,600 హెక్టార్లలో అరటి, 4,036 హెక్టార్లలో కూరగాయలు, 1,243 హెక్టార్లలో కొబ్బరి, 716 హెక్టార్లలో బొప్పాయి పంటలు దెబ్బతిన్నట్లు నివేదికలో వివరించారు.

మత్స్య, పశుసంపద రంగాలపై ప్రభావం

తుపాను కారణంగా ఎనిమిది జిల్లాల్లో 2,366 పడవలు ధ్వంసమయ్యాయి. 3,308 వలలు దెబ్బతిన్నాయి. 4,795 హెక్టార్లలో ఆక్వా చెరువులకు నష్టం వాటిల్లింది. పశ్చిమగోదావరి జిల్లాలో రూ.70.46 కోట్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రూ.12 కోట్ల మేర నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. పది జిల్లాల్లో 272 పశువులు మృతి చెందగా, వాటి యజమానులకు రూ.1.52 కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉంటుందని నివేదికలో పేర్కొన్నారు.

948 గ్రామాలపై తీవ్ర ప్రభావం

గుంటూరు నుంచి శ్రీకాకుళం వరకు 16 జిల్లాల్లోని 948 గ్రామాలపై తుపాను తీవ్ర ప్రభావం చూపింది. మొత్తం 6,00,257 మంది ప్రభావితమయ్యారని అధికారులు కేంద్ర బృందానికి వివరించారు. ముందస్తు చర్యల్లో భాగంగా 81,306 మందిని పునరావాస శిబిరాలకు తరలించారు. తీవ్ర గాలుల కారణంగా 6,659 ఇళ్లు దెబ్బతినగా, రూ.16.51 కోట్ల మేర నష్టం వాటిల్లింది. వీటిలో ఒక్క కోనసీమ జిల్లాలోనే 6,328 ఇళ్లు దెబ్బతిన్నట్లు నివేదిక వెల్లడించింది.

విద్యుత్ రంగానికి రూ.1,233 కోట్ల నష్టం

తుపాను తీరం దాటే సమయంలో వీచిన బలమైన గాలుల కారణంగా విద్యుత్ వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈపీడీసీఎల్ పరిధిలోని 4,999 గ్రామాలు, సీపీడీసీఎల్ పరిధిలోని 1,267 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మొత్తం 31.46 లక్షల గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై ప్రభావం పడింది. విద్యుత్ రంగానికి రూ.1,233 కోట్ల నష్టం వాటిల్లినట్లు రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది.



రోడ్ల మరమ్మతులకు రూ.1,623 కోట్లు

రహదారులు, భవనాల శాఖ పరిధిలో 2,448 కిలోమీటర్ల రహదారులు దెబ్బతిన్నాయి. 2,188 చెట్లు నేలకొరిగాయి. 129 ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పశ్చిమగోదావరి జిల్లాలో 552 కిలోమీటర్లు, కోనసీమ జిల్లాలో 396 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయి. తాత్కాలిక, శాశ్వత పునరుద్ధరణ పనులకు రూ.1,439 కోట్లు అవసరమని అంచనా వేశారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో మరో 917 కిలోమీటర్ల రహదారులు దెబ్బతినగా, వాటి మరమ్మతులకు రూ.184.60 కోట్లు అవసరమని తెలిపారు.

ఇతర రంగాలకూ నష్టం

తుపాను ప్రభావంతో 70 తాగునీటి పథకాలు దెబ్బతిన్నాయి. 98 పాఠశాల భవనాలకు నష్టం వాటిల్లగా, మరమ్మతులకు రూ.9.86 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. 853 గ్రామ పంచాయతీల్లో 602 చోట్ల డ్రెయిన్లు మూసుకుపోగా, 2,542 బృందాలతో పారిశుద్ధ్య పనులు చేపట్టి అడ్డంకులను తొలగించారు. చిన్న నీటిపారుదల శాఖ పరిధిలో 62 చెరువులు, ఏడు కాల్వలకు గండ్లు పడ్డాయి. ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రులు, వైద్య కళాశాల భవనాలతోపాటు 61 అంగన్‌వాడీ భవనాలు దెబ్బతిన్నాయి. ఈ రంగాల్లో మొత్తంగా రూ.20 కోట్ల నష్టం జరిగినట్లు గుర్తించారు. పట్టణ ప్రాంతాల్లో 29,440 మంది ప్రజలు ప్రభావితమయ్యారు. 9,237 వీధి దీపాలు దెబ్బతిన్నాయి. 20 కిలోమీటర్ల మేర రహదారులకు నష్టం వాటిల్లగా, పునరుద్ధరణ పనులకు రూ.48.40 కోట్లు అవసరమని నివేదికలో పేర్కొన్నారు.

సీఎం సహాయనిధికి ఎస్‌బీఐ రూ.5.01 కోట్లు


అర్నబ్ తుపాను బాధితులను ఆదుకునేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అమరావతి సర్కిల్ ఉద్యోగులు ముందుకొచ్చారు. తమ ఒక రోజు వేతనమైన రూ.5.01 కోట్లను ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా అందించారు. ఎస్‌బీఐ ఎండీ అమర రామ్‌మోహన్‌రావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి చెక్కును అందజేసింది. ఈ సందర్భంగా విరాళం అందించిన ఎస్‌బీఐ ఉద్యోగులకు సీఎం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాప్తాడు ఘటనలో కీలక పరిణామం.. నిందితుడు హేమంత్ పై పోలీసుల కాల్పులు

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాప్తాడు పాఠశాల విద్యార్థినిపై దాడి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. పరారీలో ఉన్న నిందితుడు హేమంత్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆత్మకూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా, అతను పోలీసులపై రాళ్లతో దాడికి యత్నించాడు. దీంతో ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపినట్టు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన హేమంత్‌ను అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.

వివరాల్లోకి వెళితే...

రాప్తాడు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థినిపై ఆమె బంధువైన హేమంత్ దారుణంగా దాడి చేసిన విషయం తెలిసిందే. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని తరగతి గదిలోకి ఎలక్ట్రిక్ రంపంతో (చైన్‌సా) ప్రవేశించిన హేమంత్.. బాలిక తల, ముఖం, వీపు భాగాలపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కాళ్లకు కూడా



తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం నిందితుడు రంపాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. తీవ్ర గాయాలపాలైన బాలికను తొలుత అనంతపురం ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆమె ప్రస్తుతం మణిపాల్ ఆసుపత్రిలోని పీఐసీయూలో చికిత్స పొందుతోంది. ఈ కేసును సవాలుగా స్వీకరించిన పోలీసులు, నిందితుడి కోసం గాలింపు ముమ్మరం చేశారు. హేమంత్ ఆత్మకూరు సమీపంలోని అడవుల్లో దాక్కున్నట్టు సమాచారం అందడంతో, ప్రత్యేక బృందాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. లొంగిపోవాలని పోలీసులు సూచించినప్పటికీ, హేమంత్ వారిపైకి రాళ్లు విసురుతూ తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో కొందరు సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపారు. సుమారు ఆరు రౌండ్ల కాల్పులు జరిపినట్టు సమాచారం. బుల్లెట్ గాయాలతో కుప్పకూలిన హేమంత్‌ను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకుని చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.

ఫలితాలపై ఉత్కంఠ!



-మొదటిపేజీ తరువాయి

దీంతో ఎన్నికల సంఘం అక్కడ పోలింగ్ సమయాన్ని పొడిగించింది. ఓటర్లకు ఇబ్బంది కలగకుండా అదనంగా రెండున్నర గంటల సమయం కేటాయించింది. ఈ డివిజన్‌లో పోలింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

12 జిల్లాల కలెక్టర్లతో సమీక్ష

పోలింగ్ సరళిపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సమీక్ష నిర్వహించారు. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన.. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలించినట్లు తెలిపారు. జిల్లాల పరిశీలకులతో పాటు 12 జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించినట్లు వెల్లడించారు. ఈ జిల్లాల్లో ఎక్కువగా రాయలసీమ ప్రాంతానికి చెందినవే ఉన్నాయని చెప్పారు. కొన్ని జిల్లాల నుంచి చిన్నచిన్న ఫిర్యాదులు అందగా, మరికొన్ని జిల్లాల్లో ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు.

ఫిర్యాదులపై నివేదికల ఆధారంగానే చర్యలు

ఎన్నికల సంఘం తటస్థంగా వ్యవహరిస్తోందని పునేఠా స్పష్టం చేశారు. కలెక్టర్లు పంపించే నివేదికలు, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగానే చర్యలు తీసుకుంటామని తెలిపారు. విజయవాడ 55వ డివిజన్‌లో బ్యాలెట్ పేపర్ ముద్రణ సమస్యను గుర్తించి అదనపు సమయం ఇచ్చినట్లు చెప్పారు. పోలింగ్ శాతంపై పూర్తి వివరాలు మరుసటి రోజు వెల్లడిస్తామని పేర్కొన్నారు. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 63.6 శాతం పోలింగ్ నమోదైనట్లు గుర్తుచేశారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత

పోలింగ్ ముగిసిన ప్రాంతాల్లో బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. బ్యాలెట్ బాక్సులు భద్రపరిచే కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత కల్పిస్తామని ఎన్నికల కమిషనర్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

పులివెందుల ఘటనపై నివేదిక కోరాం

పులివెందులలో చోటుచేసుకున్న ఘటనలపై ఎస్పీతో మాట్లాడినట్లు పునేఠా తెలిపారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, ఎస్పీ నుంచి నివేదికలు అందిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆధారాలు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోలేమని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే పనిచేస్తుందని పేర్కొన్నారు.

275 ఎఫ్ఐఆర్‌లు నమోదు

మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు మొత్తం 275 ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు శాంతిభద్రతల ఐజీ రాజకుమారి వెల్లడించారు. పోలింగ్ రోజున మొత్తం 40 ఘటనలు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. వాటిని పరిశీలించి, అవసరమైన చోట కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అప్రమత్తంగా పనిచేసిందని వివరించారు.

రెచ్చగొట్టినా సంయమనం కోల్పోవద్దు!

-మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు.

వృద్ధులు, దివ్యాంగులకు సహకరించాలి

వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు వేసేందుకు అవసరమైన సహకారం అందించాలని కూటమి నేతలకు సీఎం సూచించారు. ఎన్నికల నిబంధనలకు లోబడి ఓటర్లను చైతన్యపరచాలని, పోలింగ్ శాతం పెరిగేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

అవాంఛనీయ ఘటనలపై అప్రమత్తం

ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే ఎన్నికల అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. ప్రత్యర్థులు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసినా కార్యకర్తలు శాంతియుతంగా వ్యవహరించాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

ఉత్తరాంధ్రలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం - ఆ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం అధికం

ఉత్తరాంధ్రలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగింది. విశాఖ, విజయనగరం, అనకాపల్లి, మన్యం, శ్రీకాకుళం జిల్లాలో ఓటర్ల చైతన్యం కనిపించింది. అనకాపల్లి, మన్యం జిల్లా పరిధిలో కొన్నిచోట్ల ఓటింగ్ శాతం అధికంగా నమోదైంది. ఓటర్లు పెద్దసంఖ్యలో వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, కొత్త ఓటర్లు ఉత్సాహంగా వచ్చి ఓటు వేశారు. ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు కుటుంబసమేతంగా వచ్చి క్యూలైన్‌లో నిల్చోని ఓటు వేశారు. విశాఖ జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా సాగింది. విశాఖ, మధురవాడ, భీమునిపట్నం, గోపాలపట్నం, పెందుర్తిలో ఓటు వేసేందుకు ఉదయం నుంచి ఓటర్లు బారులు తీరడంతో పోలింగ్ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. విశాఖ 5 రోడ్ల కూడలిలో కుటుంబ సభ్యులతో కలిసి సభాపతి అయ్యన్న పాత్రుడు, రాజ్యసభ సభ్యుడు విజయ్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్పీకర్ అయ్యన్న ప్రజలతో కలిసి క్యూలైన్‌లోనే వెళ్లి ఓటు వేశారు. గాజువాక హైస్కూల్ రోడ్డు ఎంపీ పాఠశాలలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఓటు వేశారు. విశాఖ రామ్‌నగర్‌లో ఎంపీ శ్రీభరత్ భార్య తేజస్వినితో కలిసి ఓటు వేశారు.

క్యూలైనులో వెళ్లి : ఉత్తర నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తన ఓటు వేశారు. గోపాలపట్నంలో జెడ్?పీ హైస్కూల్‌లో కుటుంబసమేతంగా ఎమ్మెల్యే గణబాబు ఓటు వేశారు. పెందుర్తి 115వ వార్డులో ఎమ్మెల్యే రమేశ్? బాబు క్యూలైనులో వెళ్లి ఓటు వేశారు. విశాఖ ఎన్?టీ కాలేజీ పోలింగ్ బూత్‌లో టీడీపీ మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏయూ ఇంగ్లీష్ మీడియం స్కూల్ పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్సీపీ మేయర్ అభ్యర్థి వరుదు కల్యాణి ఓటు వేశారు. ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధులకు పోలీసు సిబ్బంది వీల్‌చైర్ల ద్వారా పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లారు. మధురవాడ జోన్‌లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను క్రైం ఏడీసీపీ రమ్య పరిశీలించారు. అనకాపల్లి, విజయనగరం జిల్లాలో పురపోరు పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. జీవీఎంసీలో భాగమైన అనకాపల్లి జోన్‌లోని ఆరు డివిజన్లు, నర్సీపట్నం పురపాలక పరిధిలో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. యలమంచిలిలో భారీగా ఓటింగ్ శాతం నమోదయ్యింది. పెద్దపల్లి పోలింగ్ బూత్‌లో వైఎస్సార్సీపీ ఛైర్‌పర్సన్ అభ్యర్థి తులసి ఓటు వేశారు. అనకాపల్లి పట్టణంలో 95 ఏళ్ల వృద్ధురాలు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశారు. విజయనగరం కార్పొరేషన్‌తో పాటు బొబ్బిలి మున్సిపాలిటీ, నెల్లిమర్ల నగర పంచాయితీలో యువత, ప్రజలు, వృద్ధులు పెద్ద ఎత్తున తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కంటోన్మెంట్‌లోని ప్రభుత్వ పాఠశాల పోలింగ్ బూత్ వద్ద 53వ డివిజన్ కార్పొరేటర్ టీడీపీ అభ్యర్థి అనురాధ పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ నేతలు దొంగ ఓట్లు వేస్తున్నారని ఆరోపించారు. ఆమె ఆరోపణలు పోలీసులు తోసిపుచ్చారు. విజయనగరంలో ఓటు వేసిన ఎమ్మెల్యే అదితి కొన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

ఎన్నికల సరళని పరిశీలించిన పోలీస్ ఉన్నతాధికారులు

ఏలూరు, నవంబర్ 1 (మీ వార్త ప్రతినిధి):
ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో ఏర్పాటు చేసిన కమాండ్ రూమ్ నుంచి సీసీ కెమెరాల ద్వారా ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ నూజివీడు మరియు జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సరళిని ఏలూరు రేంజ్ ఐజీ జి వి జి అశోక్ కుమార్ ఐపీఎస్ ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ పరిశీలించారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లా పరిధిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఏలూరు రేంజ్ ఐజీ శ్రీ జి.వి.జి. అశోక్ కుమార్, ఐపీఎస్, ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ రూమ్ నుంచి పర్యవేక్షించారు.
వివిధ పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా పోలింగ్ సరళిని ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ, ఎన్నికల నిర్వహణ ను పర్యవేక్షించారు.
ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా



పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. రాజ్యాంగం ద్వారా ప్రజలకు కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ ఎలాంటి ఒత్తిళ్లు, బెదిరింపులు, భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఏలూరు జిల్లా పరిధిలోని మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించారు.పోలింగ్



కేంద్రాలకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు పోలీసు సిబ్బంది అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.
ప్రతి ఓటరు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తన ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకున్నారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది. ప్రతి ఓటరు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

అమలాపురం డిపో బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల (01.11.2026 నుండి 07.11.2026 వరకు) ప్రారంభ కార్యక్రమం

అమలాపురం,మీ వార్త ప్రతినిధి, నవంబర్,1
అమలాపురం డిపోలో బ్రిక్స్ సుపీరియర్ జీవనశైలి వారోత్సవాల కార్యక్రమాన్ని అమలాపురం డిపో మేనేజర్ శ్రీ ఐ. ప్రేమ్ కుమార్ గారి ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా సిబ్బందికి యోగా తరగతులు నిర్వహించి, ఆరోగ్యకరమైన జీవనశైలి, శారీరక దృఢత్వం మరియు మానసిక ప్రశాంతత యొక్క ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. అనంతరం డిపో మేనేజర్ గారు వారోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న వివిధ కార్యక్రమాల గురించి సిబ్బందికి వివరించారు. ఇందులో భాగంగా మొదటి రోజు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం (అడాప్ట్ హెల్త్ లిఫెస్టైల్), రెండవ రోజు ఇంధనాన్ని ఆదా చేయడం (సేవ్ ఎనర్జీ), మూడవ రోజు నీటిని పొదుపుగా వినియోగించడం (సేవ్ వాటర్), నాలుగవ రోజు స్థిరమైన ఆహార విధానాలను పాటించడం (అడాప్ట్ సూస్తాయినబ్లె ఫుడ్ సిస్టం), ఐదవ రోజు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా



నివారించడం (సే నో టూ సింగల్ యూస్ ప్లాస్టిక్), ఆరవ రోజు ఈ-వ్యర్థాలను తగ్గించడం (రెడ్యూస్ ఇ-), ఏడవ రోజు వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించడం (రెడ్యూస్ వేస్ట్) వంటి అంశాలపై అవగాహన కల్పిస్తాము అని తెలిపారు. అనంతరం సిబ్బంది అందరి చేత ఆరోగ్యకరమైన జీవనశైలి, పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల పొదుపు మరియు పరిశుభ్రతకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, గ్యారేజ్ , ఆఫీసు సిబ్బంది మరియు సెక్యూరిటీ వారు ఉత్సాహంగా పాల్గొన్నారు.

విద్యుత్ లో వోల్టేజ్ సమస్యను రూపుమాపుతా





పెంటపాడు-2 ఎంపీటీసీ అభ్యర్థిని కసిరెడ్డి మధులత పెంటపాడు గ్రామంలో ప్రజలను పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్య అయిన లో విద్యుత్ సమస్యను పూర్తిగా రూపుమాపుతానని పెంటపాడు ఎంపీటీసీ-2 అభ్యర్థిని కసిరెడ్డి మధులత అన్నారు. ఆదివారం పెంటపాడు లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థిని మధులత మాట్లాడుతూ పెంటపాడు ప్రజలే నా బలం అన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాల మేరకు పెంటపాడు ఎంపీటీసీ-2 అభ్యర్థినిగా, మీ బిడ్డగా మీ ముందుకు వచ్చాను మీరంతా నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే పెంటపాడు లో-విద్యుత్ పరిష్కరించేందుకు ట్రాన్స్ఫార్మర్లు అవసరమన్నారు. వెలమపేట, రెడ్డి వీధి, రెడ్డి సూరిబాబు, కుమ్మరిపుంతలో ఒకటి అవసరమైన ప్రతి చోట ట్రాన్స్ఫార్మర్ను నిర్మించి కరెంటు కోత లేకుండా విద్యుత్ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమస్యను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టిలో ఉంచగా, ఆయన ఇప్పటికే విద్యుత్ అధికారులతో మాట్లాడి ఎస్టిమేషన్ వేయడం జరిగిందన్నారు. త్రాగునీటి సమస్య కూడా కొన్ని ప్రాంతాలలో ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటుందని, ఎన్నికల అనంతరం ఈ సమస్యలన్నిటిని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సహకారంతో పరిష్కరిస్తానన్నారు. తనకు ఏ అధికారం లేకపోయినప్పటికీ ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధిని చేయించుకోగలిగామని తెలిపారు. పెంటపాడు గ్రామం మరింత అభివృద్ధి చెందాలంటే నియోజకవర్గం మారుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కు అండగా నిలిచి ఎంపీటీసీ అభ్యర్థిగా తనకు, జడ్పిటిసి అభ్యర్థిగా తనబుద్ధి రవికిరణ్ కు గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.

ముమ్మరంగా ఎంపీటీసీ స్వతంత్ర అభ్యర్థి, చాట్రాతి ప్రసాద్ ఎన్నికల ప్రచారం.

జీలుగుమిల్లి . (మీ వార్త ప్రతినిధి) మండలం చంద్రమ్మ కాలనీలో ఆదివారం స్వతంత్ర ఎంపీటీసీ అభ్యర్థి చాట్రాతి ప్రసాద్ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగింది, ఆయన ప్రచారంలో పార్టీలకు అతీతంగా ప్రజలనుండి మంచి స్పందన వస్తుందని చాట్రాతి ప్రసాద్ తెలిపారు,
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల ప్రచారంలో ప్రజా సమస్యలు తెలుసుకున్నానని జీలుగుమిల్లిలో స్థానికంగా ఉండే తమ కుటుంబం, గతంలోనే దూర దృష్టితో మండల ప్రజలకు ఉపయోగపడే గవర్నమెంట్ ఆసుపత్రికి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకి స్థలాన్ని ఇవ్వటం జరిగిందని ఆయన గుర్తు చేశారు, అదేవిధంగా ఎంపీటీసీగా అవకాశం ఇస్తే ఇంకా ప్రజలకు మరిన్ని సేవలు చేయాలని ఉద్దేశంతో పోటీ చేయటం జరిగిందని మీ అమూల్యమైన ఓటు "కుండ" గుర్తుపై వేసి అఖండ విజయం ఇవ్వాలని కోరారు, ఈ కార్యక్రమంలో కొండపల్లి దుర్గాప్రసాద్, కొర్ల రామయ్య, కోలా లక్ష్మణ్, వెంకటలక్ష్మి తదితర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..



జీలుగుమిల్లిలో కూటమి అభ్యర్థుల ప్రచార జోరు.. గ్లాస్, సైకిల్ గుర్తులకు ప్రజల మద్దతు కోరుతూ ఇంటింటి ప్రచారం



జీలుగుమిల్లి,(మీ వార్త ప్రతినిధి) మండల కేంద్రం జీలుగుమిల్లి సీఆర్ఆర్ కాలనీ, మెయిన్ సెంటర్, ఆర్యవైశ్య సంఘం, కాపు సంఘాల వారిని కూటమి ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులు జనసేన నేత గడ్డ మణుగు రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఎంపీటీసీ అభ్యర్థి కారం సుజాత గాజు గ్లాస్ గుర్తుకు, జడ్పీటీసీ అభ్యర్థి కుంజా నాగమణి సైకిల్ గుర్తుకు తమ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటూ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి అభ్యర్థులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ ప్రచారంలో జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, టిడిపి మండల అధ్యక్షుడు సుంకవల్లి సాయి, టిడిపి నాయకులు మోడీ యం వెంకటకృష్ణ. బీజేపీ నాయకులు ధారా మధు, కక్కిరాల మురళీధర్, చిర్రి శ్రీను, కోలా మధు, గొట్టాల సత్యనారాయణ, గద్దె సుబ్రహ్మణ్యం. గారపాటి శ్రీను .తదితర టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాలు





జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) లోతుగెడ్డ బాలుర గురుకుల ఆశ్రమ పాఠశాలలో బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లోతుగడ్డ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రాజేశ్వరరావు. ఆధ్వర్యంలో ఒక వారం ఏడు ఆచరణలు అనే నినాదంతో ఆదివారం ,మొదటిరోజు సుస్థిర జీవనశైలి అలవర్చుకుందాం అనే ప్రమాణం తో సుమారు 110 మంది తో మొదటి రోజు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులతో యోగ కార్యక్రమం, మొక్కలు నాటించడం, ఆటలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అప్పారావు, ఎఫ్ ఎస్ ఓ. బాబురావు, ఎఫ్ బి ఓ. లక్ష్మీనారాయణ, సర్దార్, ఏ బి ఓ. గోవిందరాజ్, దివ్య, విజయ నాగరత్నం తదితరులు పాల్గొన్నారు..

వీర్నాల ఫౌండేషన్ తరపున గ్రామ ప్రజల సహకారంతో "మనఊరు.. మన భాధ్యత " స్వచ్ఛ భారత్



గూడూరు నవంబర్ 1(మీ వార్త ప్రతినిధి) ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని వీర్నా ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గూడూరు మండలం, కోకనారాయణ పాలెం గ్రామం లో పొట్టి శ్రీరాములు ఫోటోకి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ వీర్నాల బాలాజీ, వీరి తండ్రి గారు అయిన నాంచారయ్య పూలమాల లువేసి ఘనంగా నివాళులర్పించారు.బాలాజీ మాట్లాడుతూ 58రోజుల ఆమరణ నిరాహారదీక్ష చేసి తెలుగు వారికోసం ఒక ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన త్యాగశీలి పొట్టి శ్రీరాములు తెలుగు వారి గుండెల్లో ఎప్పుడూబ్రతికే ఉంటారని అన్నారు.అనంతరం కోక నారాయణపాలెం ,వీర్నా లతోట, అనంతాయపేట నందు ఫౌండేషన్ తరపున గ్రామ ప్రజల సహకారంతో మనఊరు.. మన భాధ్యత అనే నినాదంతోఇటీవల తుఫాను సందర్భముగా పడిపోయిన ఆకులు, చెత్తా, చెదారం, కాగితాలు, సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి తొలగించారు. యీ కార్యక్రమంలో కలిసి కట్టుగా మన వీధులను, పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్ది గ్రామాలను ఆదర్శంగా నిలిపారు.

చింతూరు మండలంలో టీడీపీకి పెరుగుతున్న ప్రజాదరణ..103 కుటుంబాల చేరిక





మూడు గ్రామాల నుంచి స్వచ్ఛందంగా సైకిల్ పార్టీలో చేరిన కుటుంబాలు

చింతూరు, నవంబర్ 1 మీ వార్త ప్రతినిధి :
చింతూరు మండలంలో తెలుగుదేశం పార్టీకి ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోంది. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నారు. తాజాగా మండలంలోని మూడు గ్రామాల నుంచి 103 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పేగ గ్రామపంచాయతీ పరిధిలోని కలిగుండ గ్రామం నుంచి 25,సూరకుంట గ్రామం నుంచి 40, ఏడుగురాళ్లపల్లి పంచాయతీ పరిధిలోని దొంగల జగ్గరం గ్రామం నుంచి 38 కుటుంబాలు టీడీపీలో చేరాయి.ఈ చేరికల కార్యక్రమాలకు చింతూరు మండల టీడీపీ అధ్యక్షుడు మహమ్మద్ జమాల్ ఖాన్ నేతృత్వం వహించగా,మాజీ మండల అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డితో కలిసి నూతనంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కలిగుండ,సూరకుంట గ్రామాల్లో పేగ ఎంపీటీసీ అభ్యర్థి సున్నం పార్వతి అధ్వర్యంలో చేరికలు జరిగాయి.సూరకుంటలో పటేల్ తోడేం రామయ్య, గ్రామ పూజారి తోడేం మల్లేశ్వరరావు, కట్టాం అశోక్ కీలకంగా వ్యవహరించారు. దొంగల జగ్గరం గ్రామంలో దారావత్ స్వామి,భూక్యా సుందర్,భూక్యా మోహన్ ఆధ్వర్యంలో 38 కుటుంబాలు పార్టీలో చేరాయి.

గ్రామ సమస్యల పరిష్కారానికి హామీ
ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను జమాల్ ఖాన్ దృష్టికి తీసుకువచ్చారు.కలిగుండ గ్రామంలో వంతెన నిర్మాణం, దొంగల జగ్గరంలో చెరువు పూడికతీత పనులు చేపట్టాలని కోరారు.దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన,సమస్యలను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి దృష్టికి,అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే సేవకుడిగా పనిచేస్తానని భరోసా ఇచ్చారు.అనంతరం రాబోయే స్థానిక ఎన్నికల్లో ఏడుగురాళ్లపల్లి ఎంపీటీసీ అభ్యర్థి బత్తుల నాగమణి, పేగ ఎంపీటీసీ అభ్యర్థి సున్నం పార్వతితో పాటు జడ్పీటీసీ అభ్యర్థి తీగల కవిత విజయాన్ని కాంక్షిస్తూ మూడు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సైకిల్,గ్లాసు గుర్తులకు ఓటు వేసి కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కరపత్రాల ద్వారా ప్రజలను అభ్యర్థించారు.

జాతీయ కరాటే పోటీల్లో శ్లోక విద్యార్థుల పతకాల పంట

కుక్కునూరు నవంబర్ 01(మి వార్తా ప్రతినిధి) జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కుక్కునూరు శ్లోక కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. ఖమ్మం నగరంలోని వరక సంఘ భవనంలో సుమన్ షాటోకాన్ స్పోర్ట్స్ కరాటే-డూ అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఛాంపియన్‌షిప్--2026 పోటీల్లో శ్లోక స్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన 19 మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రతి ఒక్కరూ పతకం సాధించి రికార్డ్ సృష్టించారు. కరాటే కోచ్ సెవెన్త్ డాన్ ముత్తు శిక్షణలో, పాఠశాల పీఈటీ సుబ్బు ఆధ్వర్యంలో విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. రెండు కటాస్ విభాగాల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారు. వారిలో జక్కం గౌతమి సంహిత, వంటశాల భవిష్య, కుచర్లపాటి వర్షిత, బనారి లవంతిక, షేక్ ఫర్హానా, పాడియా టజ్విత్ మారుతీ నాయక్, బుడుగుల జస్వంత్ బెన్నీ స్వర్ణ పతకాలు సాధించగా.. మీసాల జోష్ణ హరిప్రియ, షేక్ ఫజ్లూనా, లాడే శ్రీ సాయి శరణ్ రజత పతకాలను కైవసం చేసుకున్నారు. అలాగే, శావిలి దుర్గ తపస్య, దారా



హర్షిత, బుడుగుల జెస్విక్ బెన్నీ, దొడ్డిపట్ల హోంసిక, చల్లకోటి హిమబిందు, మాదబత్తుల మౌనిక, లాడే గ్రీష్మంత్, పుచ్చకాయల దినేష్, చింతా సాత్విక కాంస్య పతకాలు సాధించి ప్రతిభ చాటారు.ఈ పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ నటుడు సుమన్ విజేతలు అందరినీ అభినందించారు. ఇక, శ్లోక విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించడం కుక్కునూరు మండలానికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా విజేతలను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కొనియాడారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా ప్రోత్సహిస్తున్న శ్లోక స్కూల్ యాజమాన్యంపై ప్రశంసల వర్షం కురుస్తోంది.


కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా వలవల బాబ్జి విస్తృత ప్రచారం



తాడేపల్లిగూడెం నవంబర్ 1 (మీ వార్త ప్రతినిధి) కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఇంచార్జ్ వల్ల మల్లికార్జునరావు (బాబ్జి)ఆదివారం విస్తృత ప్రచారం చేపట్టారు. తాడేపల్లిగూడెం మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన పెద్ద తాడేపల్లి, రామన్నగూడెం, చిన్న తాడేపల్లి, కడియద్ద, నీలాద్రిపురం, బంగారుగూడెం, వీరంపాలెం, పట్టెంపాలెం, కొమ్ముగూడెం, పుల్లయ్యగూడెం, అప్పారావుపేట, వెంకట్రావుపాలెం, గొల్లగూడెం మీదుగా మోదుగుగుంట కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం ప్రజలను ఆకట్టుకోవడంతో, గ్రామగ్రామాన ప్రజలు చూపిన ఆదరణ, ఆత్మీయ స్వాగతం ఎంతో ఆనందాన్ని, ఉత్సాహాన్ని కలిగించాయని అన్నారు. మౌలిక సదుపాయాల మెరుగుదల, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి, మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో జడ్పిటిసి అభ్యర్థి నేకూరి కిరణ్ కుమార్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జి మాడుగుల లోవైసిపి అభ్యర్థుల ప్రచార జోరు.

సెగ్మెంట్ 1 అభ్యర్థి కిముడు రాంబాబు
సెగ్మెంట్ 2 అభ్యర్థి మత్స్యరాస విజయ కుమారి
ప్యాన్ గుర్తుపై ప్రజల మద్దతు కోరుతూ ఇంటింటి ప్రచారం





జి మాడుగుల,(మీ వార్త ప్రతినిధి) జి మాడుగుల మండల కేంద్రంలో వర్తక, వ్యాపార దుకాణా దారులను, వివిధ సంఘాల వారిని, వైయస్సార్సీపి ఎంపీటీసీ, అభ్యర్థులైనా కిముడు రాంబాబు, మత్స్యరాస విజయ కుమారి సంయుక్తంగా ఆదివారం జీ మాడుగుల పురవీధులలో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిముడు రాంబాబు మాట్లాడుతూ. జి మాడుగుల సెగ్మెంట్ వన్ ఎంపీటీసీ అభ్యర్థి గా రాంబాబు, సెగ్మెంట్ టూ ఎంపీటీసీ అభ్యర్థిగా విజయ్ కుమారి, జడ్పీటీసీ అభ్యర్థి గా ఐసరం మహేశ్వరుని ఫ్యాన్ గుర్తుకు తమ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటూ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైసిపి అభ్యర్థులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ ప్రచారంలో మండల అధ్యక్షులు నుర్మాని మత్స్య కొండం నాయుడు, నాయుడు, గబ్బడి శేఖర్, అనిల్, మణి , పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ద్వారా 64 ఓట్లు నమోదు

జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) రానున్న సార్వత్రిక ఎన్నికలైనా ఎంపీటీసీ, జడ్పిటిసి. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది, తమ యొక్క ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఆదివారం సద్వినియోగం చేసుకున్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి విద్యాసాగర్ తెలిపారు... ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ, తేదీ. 1- 11- 2026 ఆదివారం నాడు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, ఏర్పాటుచేసిన, పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది తమ యొక్క ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగగా మొత్తం 64 ఓట్లు పోస్టల్ బ్యాలెట్లు ద్వారా నమోదయాయని తెలియజేశారు..

రాప్తాడు లో దాడికి పాల్పడిన హేమంత్ ను కఠినంగా శిక్షించాలి



జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలో జడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని నీ రంపం తో అతి క్రూరం గా కోసిన ఉన్మాది నీ కఠినమైన శిక్ష విధించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఏ పి యు ఎస్) అల్లూరు జిల్లా అధ్యక్షులు కొండపల్లి రాంబాబు కోరారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాప్తాడు జిల్లాలో జరిగిన సంఘటన చాలా చారకరమైనదని, ఈ పాఠశాలలో జరిగిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని . ఈ ఉదంతంలో పాల్గొన్న నిందితులకు కఠిన శిక్ష విధించాలని , ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, తక్షణమే ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని,(ఏ పి యు ఎస్) అల్లూరి జిల్లా అధ్యక్షులు కొండపల్లి రాంబాబు డిమాండ్ చేశారు.

కూటమి జడ్పీటీసీ అభ్యర్థి సంకీర్తన తో పాటు ఎంపీటీసీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం



జంగారెడ్డిగూడెం, నవంబర్ 1 (మీ వార్త ప్రతినిధి)- బీజేపీ, జనసేన, బీజేపీ బలపరిచిన కూటమి జడ్పీటీసీ అభ్యర్థి గొల్లమందల సంకీర్తన తో పాటు వేగవరం ఎంపీటీసీ జనసేన అభ్యర్థి రామచంద్ వేగవరం గ్రామంలో ఇంటి ఇంటికి ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు కు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు మండవ లక్ష్మణరావు, పిఎసిఎస్ అధ్యక్షులు ఆలపాటి రాము, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

బుట్టాయిగూడెంలో హోరెత్తిన ఎన్నికల ప్రచారం!

కొర్సా ధర్మయ్యకు వామపక్ష, కాంగ్రెస్ పార్టీల సంపూర్ణ మద్దతు

ఫ్యాన్ గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించండి: కొర్సా ధర్మయ్య





ఎటపాక, నవంబర్ 01 (మీ వార్త ప్రతినిధి): నెల్లిపాక ఎంపీటీసీ పరిధిలో ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. ఆదివారం బుట్టాయిగూడెంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి కొర్సా ధర్మయ్యకు , జడ్పిటిసి కాకా కామేశ్వరికి మద్దతుగా నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీలు ఆయనకు సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో ప్రచారానికి మరింత ఊపు వచ్చింది. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ ధర్మయ్య, కామేశ్వరి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ అభ్యర్థి కొర్సా ధర్మయ్య, జడ్పిటిసి అభ్యర్థి కాకా కామేశ్వరి మాట్లాడుతూ నెల్లిపాక ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి అవసరాలకు ప్రాధాన్యతనిస్తానని హామీ ఇచ్చారు. ప్రజాసేవ చేసేందుకు తనకు ఒక్క అవకాశం కల్పించాలని, వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌పై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో ముదిగొండ వినయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ బురం అంజలి, చిలుకూరి నాగేశ్వరరావు, పూణెం వీరమ్మ, గద్దల రమణయ్య, జగడి బాబు, పింగిలి కిషోర్, పింగిలి ఎంకన్న, జిలకర సాంబయ్య తదితర నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

శిడగం వారి వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొన్న డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు.

అమలాపురం, మీ వార్త ప్రతినిధి, నవంబర్, 1రావులపాలెంలోని తేతలి సత్యనారాయణ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం శిడగం సత్యనారాయణ (నాయుడు), లలితకుమారి దంపతుల కుమారుడు వెంకట సాయి వినయ్, నాగ కౌసల్యల వివాహ రిసెప్షన్ వేడుక వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు ట్రెజరర్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షులు, ప్రముఖ వ్యాపారవేత్త, జాతీయ సేవా పురస్కార అవార్డు గ్రహీత డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు గ్రామ మాజీ ఉపసర్పంచ్ చల్లా నానాజీ, చల్లా భూషణం, ఎలుగుబంట్ల సాయిబాబు, ఎలుగుబంట్ల వీరయ్య, కొమ్మిశెట్టి సాయిబాబు, ఆకుల రామకృష్ణ, సకుమళ్ల రాముడు, వెత్సా శ్రీనివాస్, ఎరుకొండ గణేష్, లంకే వెంకటరెడ్డి, నార్ని వీరబాబు, నార్ని సెంథిల్ కుమార్, పాకా శ్రీను (పాస్టర్), పాకా దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది : డీఈవో రమేశ్



మద్దూరు (ధూళిమిట్ట): సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్ అన్నారు. ధూళిమిట్ట హైస్కూల్లో గెజిటెడ్ హెచ్ఎం, ఎంఈవో అనుముల కరుణాకర్ రెడ్డి ఉద్యోగ విరమణకు డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి అవసరమైన మానవ వనరులను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఉత్తమ సేవలు అందించడం ద్వారానే ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా గెజిటెడ్ హెచ్ఎంగా, ఎంఈవో కరుణాకర్ రెడ్డి అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ప్రధానంగా ధూళిమిట్ట హైస్కూల్ అభివృద్ధి కోసం చూపిన చొరవ అభినందనీయమన్నారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం చిలుక వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించిన సన్మాన సభలో రిటైర్డు డీఈవో శ్రీనివాస్ రెడ్డి , సర్పంచ్ గునుకుల లీలాజగన్మోహన్ రెడ్డి , మద్దూరు ఎంఈవో వరదరాజు, విశ్రాంత ఉపాధ్యాయులు తిగుళ్ళ సుధాకరశర్మ, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎంపీటీసీ శ్రీమతి సమ్మెట సీతామహాలక్ష్మి ముమ్మర ప్రచారం.



గూడూరు నవంబర్ 1 (మీ వార్త ప్రతినిధి) గూడూరు మండలం లో ఆదివారం వైసీపీ పార్టీ నాయకులు, గూడూరు మండల వైసీపీ నేతలు సమ్మెట జయ వర్ధన్ ఆధ్వర్యంలో జడ్పిటిసి అభ్యర్థి ఎంపిటిసి అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతుంది. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ యర్రంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ అభివృద్ధి కావాలంటే వైసీపీ జెడ్పిటిసి అభ్యర్థి జక్కా శాంత కుమారి ఎంపీటీసీ వైసీపీ అభ్యర్థి సమ్మెట సీతా మహాలక్ష్మి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గ్రామాల అభివృద్ధి చందాలంటే ఓటు అనే వజ్రాయుధం ఒక్కటే మార్గం అని గూడూరు మండలం వైసీపీ నాయకులు అన్నారు. మీ అమూల్యమైన ఓటుని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కూటమి ఎంపీటీసీ జడ్పిటిసి అభ్యర్థులను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో ప్రజల నుండి మంచి స్పందన వస్తుందని, కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని ఆయన అన్నారు. తమను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ముక్కొల్లు గ్రామ వైసీపీ నాయకులు, తదితర నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

ఆకుమర్రు బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి అర్పించిన మాజీ జడ్పీ చైర్మన్ ఉప్పాల హారికా రాము



గూడూరు నవంబర్ 1 (మీ వార్త ప్రతినిధి) ఈరోజు స్థానిక సంస్థల క్యాంపెనింగ్ భాగంలో విచ్చేసిన రాష్ట్ర వైసీపీఎస్సీ సెల్ నాయకులు కారుమంచి కామేష్ ఆధ్వర్యంలో ఆకుమర్రు బిఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి అర్పించిన మాజీ జడ్పీ చైర్మన్ అయినటువంటి ఉప్పల హారిక ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కారు నుంచి కామేష్ అలాగే పర్ణం పెదబాబు , మాజీ ఎంపీ పి.సంఘు మధు సుధానారావు, మాజీ జడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు ఆ కుమార్ వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు ఈ కార్యక్రమంలోపాల్గొన్నారు.

పట్టింపాలెం గ్రామాభివృద్ధే లక్ష్యం

ఎంపీటీసీ అభ్యర్థి బోళ్ల వెంకట సుబ్బారావు (సబ్బి)



తాడేపల్లిగూడెం నవంబర్ 1 (మీ వార్త ప్రతినిధి) తనను గెలిపిస్తే పట్టింపాలెం, వీరంపాలెం గ్రామాలను అభివృద్ధి చేస్తానని కూటమి ఎంపీటీసీ అభ్యర్థి బోళ్ల వెంకట సుబ్బారావు (సబ్బి) అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేసే ఎంపీటీసీగా తనను, జడ్పిటిసిగా నేకూరి కిరణ్ కుమార్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టిడిపి ఇన్చార్జి వలవల బాబ్జిలతో తనకున్న సన్నిహిత సంబంధాలతో అత్యధికంగా నిధులు తీసుకువచ్చి వీరంపాలెం, పట్టింపాలెం గ్రామాలను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని హామీ ఇచ్చారు. ఈయన వెంట ఎన్నికల ప్రచారంలో జనసేన నాయకులు, పట్టింపాలెం మాజీ సర్పంచ్ బొనిగే పోతన, బిజెపి నాయకులు దూసనపూడి శ్రీనివాస్, ఇంకా పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ .. బీఆర్ఎస్‌లో చేరిన ఉప సర్పంచ్, వార్డు సభ్యులు



చందంపేట, (దేవరకొండ) : జిల్లాలోని పీఏ పల్లి మండలం నక్కలపెంట తండాకు చెందిన ఉప సర్పంచ్, వార్డు సభ్యులతోపాటు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బిఆర్ఎస్ (పార్టీలో చేరారు. దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నప్పటికీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని రవీంద్ర కుమార్ గుర్తుచేశారు. పార్టీలో చేరిన వారిలో ఉప సర్పంచ్ అంగోతు మునియా, వార్డు సభ్యులు కేతావత్ హరియా, మేగావత్ కిషన్, కేతావత్ మంగ్తా, ముడావత్ బాలా, మేగావత్ హనుము బావాజీ, మేగావత్ కృష్ణ, కేతావత్ సంతోష్, జాతవత్ రాజా, జాతవత్ నాగేష్, కేతావత్ కుమార్, ఆమ్ గోతు రమేష్, ముడావత్ శ్రీనివాస్

జోరందుకున్న ఎంపీటీసీ అభ్యర్థి గాడిద అలివేలు ఎన్నికల ప్రచారం



కుక్కునూరు, నవంబర్ 01 (మి వార్తా ప్రతినిధి) కుక్కునూరు మండలంలో గణపవరం--పెదరావి గూడెం ఎంపీటీసీ అభ్యర్థి గాడిద అలివేలు ఎన్నికల ప్రచారం జోరందుకుంది. కూటమి నాయకుల ఆధ్వర్యంలో గ్రామాల్లో ఇంటింటి వెళ్లి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను కలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీటీసీ అభ్యర్థి గాడిద అలివేలు గాజు గ్లాసు గుర్తుపై, జడ్పీటీసీ అభ్యర్థి బొంతు కోమల దేవి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తమకు మద్దతు తెలపాలని ఓటర్లను కోరారు. గ్రామాల అభివృద్ధికి, పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని, గ్రామాల రూపురేఖలు మార్చే లక్ష్యంతో ముందుకు సాగుతామని ఈ సందర్భంగా వారు ఓటర్లకు తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన,టిడిపి,బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

టిడిపి ఎంపీటీసీతోట వెంకటరమణ ముమ్మర ప్రచారం.



జీలుగుమిల్లి (. మీ వార్త ప్రతినిధి) జీలుగుమిల్లి మండలంరాచన్న గూడెం లో ఆదివారం టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు, పులుమోలు శివాజీ ఆధ్వర్యంలో జడ్పిటిసి అభ్యర్థి ఎంపిటిసి అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతుంది. ఈ సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షులు పులుమోలు శివాజీ మాట్లాడుతూ అభివృద్ధి కావాలంటే టిడిపి జెడ్పిటిసి అభ్యర్థి కుంజ నాగమణి ఎంపీటీసీ కూటమి అభ్యర్థి తోట వెంకటరమణ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గ్రామాల అభివృద్ధి చందాలంటే ఓటు అనే వజ్రాయుధం ఒక్కటే మార్గం అని పులుమోలు శివాజీ అన్నారు. మీ అమూల్యమైన ఓటుని సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి ఎంపీటీసీ జడ్పిటిసి అభ్యర్థులను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో ప్రజల నుండి మంచి స్పందన వస్తుందని, కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని ఆయన అన్నారు. తమను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పూసం ఉదయ్. తోట పండు. తదితర నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

పిడుగుపాటుకు వ్యక్తి మృతి చలించిన ఎమ్మెల్యే బొలిశెట్టి హృదయం

కుటుంబ సభ్యులకు రూ.1 లక్ష ఆర్థిక సాయం అందజేత



పెంటపాడు నవంబర్ 1 (మీ వార్త ప్రతినిధి) మండలంలోని బోడపాడు గ్రామానికి చెందిన పాలా రాంబాబు పిడుగుపాటుకు గుండె ఆగి మరణించిన విషయం విదితమే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం ఆయన మృతుని ఇంటికి వెళ్లి రాంబాబు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. మృతుని కుటుంబ పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులకు రూ. 1 లక్ష ను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఆయన దాతృత్వానికి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు పెంటపాడు మండలం జడ్పిటిసి (జనసేన) కూటమి అభ్యర్థి తనబుద్ధి రవికిరణ్, పాలూరి వెంకటేశ్వరరావు, మట్టా సత్యనారాయణ, కొండపల్లి శ్రీను, రాంబరకెల బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నిక

ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు



పెడ,న నవంబర్ 1 (మీ వార్త ప్రతినిధి) పెడన పట్టణ మునిసిపల్ ఎన్నికల్లో 16,694 ఓట్లు వినియోగించుకున్నారు.. 65.79 శాతం పోలింగ్ నమోదు అయ్యింది.కృష్ణా జిల్లాలోని మూడు పురపాలక సంఘం ఎన్నికల్లో పెడనలో అత్యధిక పోలింగ్ నమోదైంది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి పెడన పురపాలికలో 16,694 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా.. 65.79 శాతం పోలింగ్ నమోదైంది. మచిలీపట్నంలో 76,724 ఓట్లతో 55.10 శాతం, ఉయ్యూరులో 19,463 ఓట్లతో 59.35 శాతం పోలింగ్ నమోదైంది. ఓటింగ్ శాతంతోపాటు పోలైన ఓట్ల సంఖ్యలోనూ పెడన తనదైన స్థానం నిలుపుకుంది.

ఫ్లైట్ ప్రయాణికులకు గుడ్ న్యూస్..
అదనపు బాదుడుకు అడ్డుకట్ట

భారతీయ విమానయాన రంగంలో ప్రయాణీకుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విమాన టికెట్ల ధరల పెంపులో ఏకపక్ష ధోరణులకు అడ్డుకట్ట వేసేందుకు, ప్రయాణీకులపై అదనపు చార్జీల భారాన్ని తగ్గించేందుకు ఉద్దేశించిన కొత్త విమాన చార్జీల (ఎయిర్‌ఫేర్) నిబంధనలను కేంద్ర ప్రభుత్వం ఖరారు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ నిబంధనలకు తుదిరూపు తెచ్చింది. ప్రైవేట్ విమాన సంస్థలు పండుగలు, సెలవుదినాలు, అత్యవసర సమయాల్లో ఇష్టానుసారం టికెట్ ధరలను విపరీతంగా పెంచుతున్నాయనే విమర్శలపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. సామాజిక కార్యకర్త ఎస్.లక్ష్మీనారాయణ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం నేపథ్యంలో కోర్టు జోక్యంతో కేంద్రం ఈ నూతన విధానాన్ని తీసుకువచ్చింది. డైనమిక్ ప్రైసింగ్ పేరిట ప్రయాణీకులను దోచుకుంటున్న తీరుపై తగిన నియంత్రణ ఉండాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేయడంతో ప్రభుత్వం ఈ చట్టబద్ధమైన నిబంధనలను సిద్ధం చేసింది. కేవలం బేస్ ఫేర్ మాత్రమే కాకుండా లగేజ్ ఫీజులు, సీట్ సెలక్షన్, ఇతర అదనపు ప్రయాణీకుల చార్జీల మోతకు ఈ నిబంధనల ద్వారా అడ్డుకట్ట పడనుంది. విమానయాన సంస్థలు టికెట్ల ధరల నియంత్రణలో మరింత పారదర్శకత పాటించేలా నిబంధనలను రూపొందించారు. విమానాల



రాకపోలకు అంతరాయం ఏర్పడినప్పుడు లేదా విపరీతమైన ధరల పెరుగుదల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం జోక్యం చేసుకునేలా నిబంధనల్లో వెసులుబాటు కల్పించారు. ఈ నూతన నిబంధనలకు సంబంధించి ఇప్పటికే పరిపాలనాపరమైన ఆమోదం లభించిందని, త్వరలోనే అధికారిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుందని కేంద్ర ప్రభుత్వం కోర్టుకు వెల్లడించింది.

క్యాన్సర్ మందుల ధరలకు భారీ కోత!

న్యూఢిల్లీ: క్యాన్సర్ వ్యాధితో పోరాడుతున్న రోగులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే 543 బ్రాండ్ల ఔషధాల గరిష్ఠ విక్రయ ధరలను భారీగా తగ్గించింది. కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేసింది. తగ్గించిన కొత్త ధరలు నవంబర్ 9 నుంచి అమల్లోకి రానున్నాయి. కొన్ని కీలక ఔషధాల ధరలు 80 శాతానికి పైగా తగ్గడం విశేషం. దీంతో ఖరీదైన క్యాన్సర్ చికిత్స పొందుతున్న రోగులకు ఆర్థిక భారం కొంతమేర తగ్గనుంది.

మూడు కీలక మందుల ధరల్లో భారీ తగ్గింపు..

ట్రేడ్ మార్జిన్ రేషనలైజేషన్ విధానం ద్వారా ఔషధాల విక్రయంపై ఉన్న అధిక లాభాల మార్జిన్లను నియంత్రిస్తూ ఎన్‌పీపీఏ ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా బెవాసిజాబ్ ఇంజెక్షన్ ధర రూ. 21,767 నుంచి రూ. 5,930కి తగ్గింది. ఫుల్‌వెస్ట్రాంట్ ఇంజెక్షన్ ధర రూ. 26,072 నుంచి రూ. 5,491కి దిగివచ్చింది. అజాసిటిడిన్ ఇంజెక్షన్ ధర రూ. 6,337 నుంచి రూ. 1,495కి తగ్గింది. ఈ ధరల తగ్గింపు క్యాన్సర్ చికిత్సకు అయ్యే ఖర్చును తగ్గించడంలో కీలకంగా మారనుంది.



20కి పైగా క్యాన్సర్ల చికిత్సకు ఉపయోగం..

రొమ్ము క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్, పెద్దప్రేగు క్యాన్సర్, అండాశయ, గర్భాశయ క్యాన్సర్లతో పాటు 20కి పైగా రకాల క్యాన్సర్ల చికిత్సలో ఉపయోగించే ఔషధాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఇమ్యునోథెరపీ మందులు, డెనోసుమాబ్, పెగ్‌ఫిల్‌గ్రాస్టిమ్ వంటి కీలక ఔషధాల ధరలు కూడా తగ్గనున్నాయి. క్యాన్సర్ చికిత్సలో దీర్ఘకాలం పాటు మందులు వాడాల్సి రావడంతో ధరల తగ్గింపు రోగుల కుటుంబాలకు కొంత ఆర్థిక ఉపశమనం కలిగించనుంది.

మరిన్ని మందుల ధరల తగ్గింపునకు అవకాశం..

ఫార్మా కంపెనీల నుంచి అదనపు వివరాలు అందిన కొద్దీ ఔషధాల ధరల జాబితాను మరింత విస్తరించే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. క్యాన్సర్ చికిత్సను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడం, మందుల ధరలపై నియంత్రణ కొనసాగించడం ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కొత్త ధరలు అమల్లోకి వచ్చిన తర్వాత రోగులకు వాస్తవంగా ఎంత మేరకు ప్రయోజనం చేకూరుతుందన్నది కీలకం కానుంది

బిజినెస్

పండగ వేళ ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.2,820!



దేశంలో రాబోయే పండగల సీజన్ వేళ సామాన్యులు, హోటళ్లపై ఆర్థిక భారం మోపుతూ చమురు మార్కెటింగ్ కంపెనీలు మరోసారి ధరల పెంపునకు సిద్ధపడ్డాయి. వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కేజీల ఎల్‌పీజీ సిలిండర్ ధరను మరో రూ.10 పెంచుతూ నవంబర్ 1 నుంచి కొత్త ధరలను అమల్లోకి తెచ్చాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో ఒక కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,820కి చేరుకుంది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు వరుసగా మూడో నెల కూడా పెరగడం గమనార్హం. గత సెప్టెంబర్, అక్టోబర్ నెలలతో పాటు తాజాగా నవంబర్‌లోనూ ధరలు పైకి కదలడం వ్యాపార వర్గాలను కలవరపెడుతోంది. అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధరల్లో నెలకొన్న అనిశ్చితి, సౌదీ అరామ్‌కో కాంట్రాక్ట్ ధరల పెరుగుదల, సముద్ర మార్గాల్లో రవాణా రిస్క్ ప్రీమియంలు పెరగడం వంటివే ఈ ధరల సవరణకు ప్రధాన కారణమని ఇంధన రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

హోటళ్లు, రెస్టారెంట్లపై ప్రభావం

దీపావళి పండుగ వేళ ఈ ధరల పెంపు హోటళ్లు, రెస్టారెంట్లు, కేటరింగ్, ఇతర చిన్నపాటి వ్యాపారాలపై ప్రభావం చూపనుంది. ఇప్పటికే ఆహార పదార్థాల ముడిసరుకుల ధరలు పెరిగి సతమతమవుతున్న హోటెల్ విభాగానికి ఈ వాణిజ్య గ్యాస్ ధరల భారం మరింత భారంగా మారనుంది. దీనివల్ల రాబోయే రోజుల్లో హోటళ్లలో తినే తిండి, టీ-కాఫీలు తదితర సేవలు మరింత ప్రియమయ్యే ప్రమాదం ఉంది.

గృహ వినియోగదారులకు ఊరట

మరోవైపు, గృహ వినియోగదారులకు ఉపశమనం కలిగించేలా 14.2 కేజీల సాధారణ దేశీయ (డొమెస్టిక్) ఎల్‌పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదని చమురు కంపెనీలు స్పష్టం చేశాయి. దేశ రాజధాని ఢిల్లీలో డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.942 వద్దే స్థిరంగా కొనసాగుతోంది. కోట్లాది కుటుంబాలకు ఇది తాత్కాలిక ఊరటనిచ్చినప్పటికీ కమర్షియల్ గ్యాస్ ధరల పెరుగుదల పరోక్షంగా ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఏఐ షాపింగ్‌లో జెన్‌జీ కంటే మినియల్స్ టాప్!

సాంకేతికత వేగంగా మారుతున్న తరుణంలో భారతీయ వినియోగదారుల కొనుగోలు శైలిలోనూ విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. ఏఐ ఆధారిత షాపింగ్ టూల్స్‌ను ఉపయోగించడంలో మినియల్స్ సరికొత్త ట్రెండ్ సృష్టిస్తున్నారు. ప్రముఖ గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ మెకిన్సే అండ్ కంపెనీ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం, భారతదేశంలో మినియల్స్(1981 నుంచి 1996 మధ్య జన్మించిన వారు)లో ఏఐ షాపింగ్ అడాప్షన్ ఏకంగా 84 శాతంగా నమోదైంది. దీనితో వారు జెన్‌జీ (1997 నుంచి 2012 మధ్య జన్మించిన వారు-74 శాతం)తో పోలిస్తే ముందుజలో ఉన్నారు.

ప్రపంచ స్థాయిలో భారత్‌కు రెండో స్థానం

ఏఐ ఆధారిత కొనుగోళ్లలో చైనా తొలి స్థానంలో ఉండగా భారతదేశం ప్రపంచంలోనే రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రపంచ సగటు (53 శాతం)తో పోలిస్తే భారతదేశంలో ఏఐ షాపింగ్ వినియోగం 76 శాతంగా ఉండటం విశేషం. దేశంలోని వినియోగదారులు కేవలం ప్రొడక్ట్ సెర్చ్ చేయడం వరకే పరిమితం కాకుండా వస్తువులను పోల్చడానికి, సరైన నిర్ణయాలు తీసుకోవడానికి, చివరికి చెల్లింపులు పూర్తి చేయడానికి కూడా ఏఐ టూల్స్‌పై ఆధారపడుతున్నారు.

ఇషాన్, శ్రేయస్ అర్ధశతకాలు వృథా..
చివరి టీ20లో భారత్‌కు ఓటమి

న్యూజిలాండ్‌తో సిరీస్‌ను ఇప్పటికే కైవసం చేసుకున్న టీమిండియాకు ఆఖరి టీ20లో ఓటమి తప్పలేదు. ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ అర్ధ శతకాలతో 191 పరుగులు చేసినా.. టిమ్ సీఫర్ట్ (93), గ్లెన్ ఫిలిప్స్ (65 నాటౌట్) ధాటికి న్యూజిలాండ్ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. మరో 12 బంతులు మిగిలుండగానే ఏడు వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌ను 3-2తో ముగించింది.

ఇషాన్, శ్రేయస్ అర్ధ శతకాలతో రాణింపు

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. అభిషేక్ శర్మ 1, సంజూ శాంసన్ 4 పరుగులకే ఔటయ్యారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇద్దరూ దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఇషాన్ కిషన్ 32 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 61 పరుగులు చేశాడు. శ్రేయస్ అయ్యర్ 23 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 50 పరుగులు సాధించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యాన్ని అందించారు. ముఖ్యంగా మైఖేల్ బ్రేస్‌వెల్ వేసిన పదో ఓవర్లో ఏకంగా 27 పరుగులు రాబట్టారు. దీంతో పది ఓవర్లకు భారత్ 111/2తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. అయితే అర్ధ శతకాల తర్వాత ఇద్దరూ స్వల్ప వ్యవధిలోనే ఔటయ్యారు. ఇషాన్ కిషన్‌ను బ్లెయిర్ టిక్నర్, శ్రేయస్ అయ్యర్‌ను నాథన్ స్మిత్ పెవిలియన్‌కు పంపించారు. తిలక్ వర్మ 6 పరుగులకే వెనుదిరిగాడు. వరుస వికెట్లు కోల్పోయిన భారత్‌ను నామన్ ధీర్, నితీశ్ కుమార్ రెడ్డి ఆదుకున్నారు. నామన్ ధీర్ 23 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 33 పరుగులు చేశాడు. నితీశ్ కుమార్ రెడ్డి 17 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 22 పరుగులు సాధించాడు. చివర్లో భువనేశ్వర్ కుమార్ 6, అర్ష్‌దీప్ సింగ్ 1 పరుగు చేశారు. ప్రిన్స్ యాదవ్ ఖాతా తెరవలేదు. దీంతో నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి భారత్ 191 పరుగులకు చేరుకుంది.

న్యూజిలాండ్ బౌలర్లలో ఆడమ్ మిల్నే 19 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. బ్లెయిర్ టిక్నర్ 38 పరుగులిచ్చి రెండు వికెట్లు, నాథన్ స్మిత్ 28 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశారు.



సీఫర్ట్ విధ్వంసం.. ఫిలిప్స్ అండ

192 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఫిన్ అలెన్ 2 పరుగులకే అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత టిమ్ సీఫర్ట్, డారిల్ మిచెల్ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ముఖ్యంగా సీఫర్ట్ దూకుడుగా ఆడుతూ పరుగుల వరద పారించాడు. 13 పరుగుల వద్ద నామన్ ధీర్ చేతికి చిక్కాల్సిన సీఫర్ట్ క్యాచ్‌ను జారవిడిచాడు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న అతడు భారత బౌలర్లను ఉతికారేశాడు. కేవలం 50 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 93 పరుగులు చేశాడు. సెంచరీకి చేరువైన సమయంలో నితీశ్ కుమార్ రెడ్డి బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు.

మరోవైపు డారిల్ మిచెల్ కూడా వేగంగా ఆడాడు. 16 బంతుల్లో 29 పరుగులు చేసి వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో అభిషేక్ శర్మకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అప్పటికి న్యూజిలాండ్ స్కోరు 84/2గా ఉంది. మిచెల్ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన గ్లెన్ ఫిలిప్స్.. సీఫర్ట్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వీరిద్దరూ భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఫిలిప్స్ 38 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 65 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. 15.3వ ఓవర్లో సీఫర్ట్ ఔటైనప్పటికీ.. ఫిలిప్స్ జోరు తగ్గలేదు. చివరి ఓవర్లలో అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్లు బాదాడు. అనంతరం భువనేశ్వర్ కుమార్ వేసిన 18వ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టి మ్యాచ్‌ను ముగించాడు. మరోవైపు బీవన్ జాకబ్స్ ఒక పరుగుతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో న్యూజిలాండ్ 17.6 ఓవర్లలో 195/3 స్కోరు చేసి ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

ఫిలిప్స్ ఖాతాలో సిరీస్ రికార్డు

ఈ మ్యాచ్‌లో అర్ధ శతకంతో రాణించిన గ్లెన్ ఫిలిప్స్ మరో ఘనత సాధించాడు. ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. ఈ సిరీస్‌లో మొత్తం 332 పరుగులు సాధించాడు. అంతేకాకుండా నాలుగు అర్ధ శతకాలు నమోదు చేశాడు.

స్పోర్ట్స్

ఇషాన్ కిషన్ అరుదైన ఘనత..
సూర్యకుమార్ రికార్డు తెరమరుగు!



టీమిండియా యువ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ అరుదైన ఘనత సాధించాడు. అంతర్జాతీయ టీ20ల్లో ఒక క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. న్యూజిలాండ్‌తో ఆదివారం జరిగిన ఐదో టీ20లో ఈ ఘనత అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో 32 బంతుల్లో 61 పరుగులు చేసి జట్టు స్కోరు పెరగడంలో కీలక పాత్ర పోషించాడు.

సూర్యకుమార్ రికార్డు బద్దలు

2022లో టీమిండియా మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 31 ఇన్నింగ్స్‌ల్లో 1,164 పరుగులు చేశాడు. ఇప్పటివరకు ఇదే భారత రికార్డుగా ఉంది. ఇషాన్ ఈ ఏడాది 37 ఇన్నింగ్స్‌ల్లో 1,220 పరుగులు చేసి ఆ రికార్డును అధిగమించాడు. ఐదో టీ20కి ముందు అతడి ఖాతాలో 1,159 పరుగులు ఉన్నాయి. సూర్య రికార్డును అధిగమించడానికి మరో ఆరు పరుగులు అవసరం కాగా.. ఇన్నింగ్స్ ఆరంభంలోనే ఆ మైలురాయిని చేరుకున్నాడు.

ప్రపంచ జాబితాలో నాలుగో స్థానం

ఒక క్యాలెండర్ ఏడాదిలో టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఇషాన్ ప్రస్తుతం నాలుగో స్థానంలో నిలిచాడు. ఆస్ట్రియా ఆటగాడు కరణ్‌బీర్ సింగ్ 1,488 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. పాకిస్థాన్ ఆటగాడు మహ్మద్ రిజ్వాన్ 1,326 పరుగులతో రెండో స్థానంలో, బ్రహ్మైన్ ఆటగాడు ఫయాజ్ అహ్మద్ 1,251 పరుగులతో మూడో స్థానంలో ఉన్నారు. టెస్టు హోదా కలిగిన దేశాల ఆటగాళ్లలో ఇషాన్ రెండో స్థానంలో నిలిచాడు. ఇదే మ్యాచ్‌లో ఇషాన్ అంతర్జాతీయ టీ20ల్లో 2 వేల పరుగుల మైలురాయిని కూడా అందుకున్నాడు. బంతుల పరంగా ఈ ఘనత సాధించిన మూడో వేగవంతమైన భారత ఆటగాడిగా నిలిచాడు. ఇషాన్ 1,345 బంతుల్లో ఈ పరుగులు పూర్తి చేశాడు. అభిషేక్ శర్మ 1,024 బంతుల్లో, సూర్యకుమార్ యాదవ్ 1,164 బంతుల్లో ఈ మైలురాయిని చేరుకున్నారు. ఈ సిరీస్‌లో ఇషాన్‌కు ఆరంభం ఆశించిన స్థాయిలో లేదు. ఆడిన తొలి మ్యాచ్‌లో ఒక పరుగు, నాలుగో టీ20లో సున్నాకే వెనుదిరిగాడు. కుడి తొడ కండరాల గాయంతో మధ్యలో రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే చివరి మ్యాచ్‌లో అర్ధశతకంతో మెరిసి రెండు కీలక రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు.

ఎన్టీఆర్ 'డ్రాగన్'కు ఇద్దరు సంగీత దర్శకులా .. అసలు కథేంటి?

యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'డ్రాగన్'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన నాలుగు నిమిషాల నిడివి ఉన్న గ్లింప్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా ఎన్టీఆర్ పాత్ర తీరు, ఆయన చెప్పిన పవర్‌ఫుల్ డైలాగులు అభిమానులను ఆకట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన మరో ఆసక్తికరమైన వార్త ఇప్పుడు ఫిల్మ్ నగర్ వర్గాల్లో చర్చకు దారితీసింది. 'డ్రాగన్' చిత్రానికి ఇప్పటికే సంగీత దర్శకుడు రవి బసూర్ పనిచేస్తున్నారనే ప్రచారం ఉంది. అయితే తాజాగా మరో సంగీత దర్శకుడు శశ్వత్ సచ్‌దేవ్ పేరు తెరపైకి రావడంతో కొత్త చర్చ మొదలైంది. రవి బసూర్ స్థానంలో శశ్వత్ సచ్‌దేవ్‌ను తీసుకుంటున్నారా? లేక ఈ భారీ ప్రాజెక్ట్‌కు ఇద్దరు సంగీత దర్శకులు కలిసి పనిచేయబోతున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ఇద్దరూ ఈ సినిమాకు సంగీతం అందిస్తే ప్రేక్షకులకు సరికొత్త సంగీత అనుభూతి లభించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.



రవి బసూర్ మాస్ నేపథ్య సంగీతం, శశ్వత్ సచ్‌దేవ్ విభిన్నమైన సంగీత శైలి కలిస్తే తెరపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రశాంత్ నీల్ సినిమాల్లో యాక్షన్ సన్నివేశాలతో పాటు నేపథ్య సంగీతానికి ప్రత్యేక స్థానం ఉంటుంది. ముఖ్యంగా భారీ యాక్షన్ సన్నివేశాలను మరింత ప్రభావవంతంగా చూపించడంలో సంగీతం కీలక పాత్ర పోషిస్తుంది. 'డ్రాగన్' కథలోనూ భావోద్వేగాలు, యాక్షన్ ప్రధానంగా ఉండనున్నాయనే ప్రచారం నేపథ్యంలో సంగీతంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని టాక్. 1967 నాటి ఆఫ్ఘనిస్తాన్ పరిస్థితుల నుంచి గోల్డెన్ ట్రయాంగిల్ వరకు సాగే కథాంశంతో ఈ సినిమా రూపొందుతోందని వార్తలు వస్తున్నాయి. ఇలాంటి నేపథ్యానికి తగ్గట్టుగా సంగీతం, నేపథ్య స్వరాలు ఉండటం చాలా ముఖ్యమని సినీ అభిమానులు భావిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'వార్ 2'తో ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయిన ఎన్టీఆర్.. 'డ్రాగన్'తో మరోసారి పాన్ ఇండియా స్థాయిలో తన సత్తా చాటాలని అభిమానులు కోరుకుంటున్నారు. అందుకే ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. అయితే రవి బసూర్, శశ్వత్ సచ్‌దేవ్ ఇద్దరూ కలిసి పనిచేస్తున్నారా? లేక సంగీత దర్శకుడి విషయంలో మార్పు జరిగిందా? అనే అంశాలపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు.

పవన్ కల్యాణ్ 33వ సినిమాకు రంగం సిద్ధం..

దర్శకుల రేసులో అనిల్ రావిపూడి, వంశీ పైడిపల్లి..!



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రజాసేవ, పాలనా వ్యవహారాల్లో బిజీగా ఉన్న పవర్ స్టార్ పవన్ కల్యాణ్ మళ్లీ వెండితెరపై సందడి చేయనున్నారనే దాని గురించి టాలీవుడ్‌లో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. రాజకీయాల్లో కీలక బాధ్యతలు చేపట్టిన తర్వాత పవన్ సినిమాలకు దూరమవుతారని చాలామంది భావించారు. అయితే తన అభిమానుల కోసం మరో చిత్రాన్ని పట్టాలెక్కించేందుకు ఆయన సిద్ధమవుతున్నారనే ప్రచారం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. పవన్ కెరీర్‌లో 33వ సినిమాగా ఈ ప్రాజెక్ట్ తెరకెక్కనుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత దిల్ రాజు తన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థపై నిర్మించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో పవన్ కల్యాణ్, దిల్ రాజు కలయికలో వచ్చిన 'వకీల్ సాబ్' మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో పవన్ నటనకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు మరోసారి ఈ ఇద్దరూ కలిసి పనిచేయబోతున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తన రాజకీయ, పాలనా బాధ్యతలకు ఇబ్బంది కలగకుండా పవన్ ఈ సినిమా కోసం ప్రత్యేకంగా కాల్షీట్లు కేటాయించనున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. పవన్ 33వ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం ఎవరికి దక్కుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ ప్రాజెక్ట్ కోసం ఇద్దరు ప్రముఖ దర్శకుల పేర్లు వినిపిస్తున్నాయి. వారిలో ఒకరు అనిల్ రావిపూడి కాగా, మరొకరు వంశీ పైడిపల్లి. కమర్షియల్ ఎంటర్‌టైనర్లతో వరుస విజయాలు అందుకుంటున్న అనిల్ రావిపూడి ప్రస్తుతం వెంకటేశ్, కల్యాణ్ రామ్ కలయికలో తెరకెక్కనున్న మల్టీస్టారర్ పనుల్లో బిజీగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు వంశీ పైడిపల్లి బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్‌తో సినిమా చేస్తున్నారు. ఈ ఇద్దరిలో పవన్ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం ఎవరికి దక్కుతుందనే దానిపై ఇంకా స్పష్టత లేదు. ఈ సినిమాలో పవన్ సరసన నటించే హీరోయిన్ విషయంలోనూ పలు పేర్లు తెరపైకి వస్తున్నాయి. 'సప్త సాగరదాచే ఎల్లో' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన రుక్మిణి వసంత్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఆమె ఎన్టీఆర్ నటిస్తున్న 'డ్రాగన్' సినిమాలోనూ నటిస్తున్నారు. మరోవైపు 'ది రాజా సాబ్'తో ప్రేక్షకులను పలకరించనున్న మాళవిక మోహనన్ పేరును కూడా పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే వీరిలో ఎవరినైనా హీరోయిన్‌గా ఎంపిక చేశారా? లేదా? అనే విషయంపై చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక సమాచారం లేదు. పవన్ కల్యాణ్ 33వ సినిమాకు సంబంధించిన వార్తలు ప్రస్తుతం అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. దర్శకుడు, హీరోయిన్, చిత్రీకరణ ప్రారంభ తేదీ, కథాంశం వంటి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.



నాతో క్షమాపణలు చెప్పించారు.. ఇప్పుడు అవే పనులు బహిరంగంగా చేస్తున్నారు: అనుపమ ఆవేదన!

ప్రముఖ టాలీవుడ్ యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ సోషల్ మీడియా వేదికగా పెట్టిన ఒక ఆవేదనభరితమైన పోస్ట్ ప్రస్తుతం సినీ వర్గాల్లోనూ, నెట్టింటనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సమాజంలో మరియు ఆన్‌లైన్ వేదికలపై మనుషుల ప్రవర్తనలో కనిపిస్తున్న డబుల్ స్టాండర్డ్స్ తనను ఎంతగానో బాధిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. ఎవరి పేర్లను నేరుగా ప్రస్తావించనప్పటికీ, ఆమె పంచుకున్న ఆ భావోద్వేగపు మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఒకప్పుడు తాను చేసిన కొన్ని చిన్న చిన్న పనులను లేదా సాధారణమైన విషయాలను తీవ్రంగా తప్పుపట్టి, తనను నిందితులుగా భావించేలా చేసిన కొందరు వ్యక్తులే.. ఇప్పుడు అదే పరిస్థితుల్లో పాత్రలు తారుమారైనప్పుడు అవే పనులను బహిరంగంగా చేస్తుండటం విచిత్రంగా ఉందని ఆమె ఎత్తిచూపారు. సంతోషంగా ఉండటం, ఇష్టమైన వారిని మనసారా మెచ్చుకోవడం వంటి చిన్న విషయాలను కూడా కొందరు కావాలనే తప్పుగా చిత్రీకరించారని, పదేపదే ఇతరులకు వివరణలు ఇచ్చుకునేలా చేసి తనను క్షమాపణలు చెప్పే దయనీయ స్థితికి నెట్టారని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, గతంలో తాను చేస్తే తప్పుగా చూపించిన అవే పనులను ఇప్పుడు ఇతరులు ఎలాంటి మొహమాటం, సంకోచం లేకుండా బహిరంగంగా చేస్తున్నారని ఆమె అన్నారు. దీన్ని బట్టి చూస్తే సమస్య అసలు మనం ఏం చేశామన్నది కాదని, అది ఎవరు చేశారన్నదే ఇక్కడ ముఖ్యం అని తనకు స్పష్టంగా అర్థమైందని అనుపమ వాపోయారు. ఇక ఇదే సమయంలో తన సోషల్ మీడియా ఫాలోవర్స్ మరియు నెటిజన్లకు ఆమె ఒక విజ్ఞప్తి చేస్తూ.. తాను ఎవరి కామెంట్‌కు రిప్లై ఇచ్చానో బేరీజు వేస్తూ విశ్లేషణలు చేయవద్దని, అనవసరమైన ట్యాగ్‌లు, మెసేజ్‌లతో తనను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. తనకు సోషల్ మీడియా ప్రపంచానికి అతీతంగా నిజ జీవితంలో ఎన్నో సొంత బాధ్యతలు, వ్యక్తిగత పోరాటాలు ఉన్నాయని, కేవలం సోషల్ మీడియాలో ఆన్‌లైన్ ఇమేజ్ కోసం నటిస్తూ బతకలేనని ఆమె కుండబద్దలు కొట్టారు. కొద్ది రోజుల క్రితం తాను ఒక ప్రేమ వ్యవహారం మరియు వ్యక్తిగత కారణాల వల్ల తీవ్రమైన మానసిక ప్రశాంతత కోల్పోయానని అనుపమ స్వయంగా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సరిగ్గా అదే కోణంలో ఆమె ఈ తాజా పోస్ట్ పెట్టడంతో, అసలు ఈ వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి చేశారనే దానిపై నెటిజన్లు రకరకాలుగా చర్చించుకుంటూ సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ చేస్తున్నారు.



ప్రభాస్ 'ఫౌజీ' షూటింగ్‌పై కీలక అప్‌డేట్.. నవంబర్ 3 నుంచి మళ్లీ సెట్స్‌లోకి పాన్ ఇండియా స్టార్!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుస భారీ చిత్రాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ఉండగా, వాటిలో దర్శకుడు హను రాఘవపూడితో చేస్తున్న 'ఫౌజీ' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాకు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. కొంతకాలం విరామం తర్వాత ఈ సినిమా చిత్రీకరణను తిరిగి ప్రారంభించేందుకు ప్రభాస్ సిద్ధమయ్యారు. ప్రస్తుతం 'కల్కి 2' చిత్రీకరణలో పాల్గొంటున్న ప్రభాస్.. త్వరలోనే 'ఫౌజీ' సెట్స్‌లోనూ అడుగుపెట్టనున్నారు. నవంబర్ 3, 2026 నుంచి ఈ సినిమా షూటింగ్ తిరిగి ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఇప్పటికే చిత్రీకరణ తుది దశకు చేరుకున్న నేపథ్యంలో మిగిలిన భాగాన్ని త్వరగా పూర్తి చేయాలని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన 'ఫౌజీ' గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని పెంచింది. ప్రభాస్ లుక్, సినిమా నేపథ్యం, యాక్షన్ అంశాలు అభిమానులను ఆకట్టుకున్నాయి. దీంతో ఈ సినిమా ఎప్పుడు థియేటర్లలోకి వస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. హను రాఘవపూడి ఈ సినిమాను పీరియాడిక్ నేపథ్యంలో భారీ చారిత్రక యాక్షన్ డ్రామాగా రూపొందిస్తున్నారు. సాధారణ కమర్షియల్ కథలకు భిన్నంగా చారిత్రక నేపథ్యం, భావోద్వేగాలు, యాక్షన్ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ కోసం ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వి నటిస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడు విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద వంటి సీనియర్ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'ఫౌజీ' చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమా బడ్జెట్ రూ.700 కోట్లకు పైగా ఉంటుందని వార్తలు వినిపిస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రభాస్ పాన్ ఇండియా క్రేజ్, హను రాఘవపూడి దర్శకత్వ శైలి, భారీ తారాగణం సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం 'ఫౌజీ' చిత్రాన్ని 2027 మార్చి 19న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం ప్రణాళిక సిద్ధం చేసింది. షూటింగ్ తిరిగి ప్రారంభం కానుండటంతో నిర్మాణ పనుల్లో వేగం పెరగనుంది. అయితే చిత్రీకరణ, ఇతర నిర్మాణానంతర పనులు అనుకున్న సమయానికి పూర్తయితేనే ఈ విడుదల తేదీ సాధ్యమవుతుంది.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512